మనిషిలో ప్రేమ ఉంది.
మనిషికి పలుకూ ఉంది.
ప్రేమను పలుకుల్లో మడత పెట్టడం
కాదెన్నడూ మనిషికి సాధ్యం.
ప్రేమకు ఎంతో ఉంది అర్థం.
ఎప్పుడూ చేయదు అది శబ్దం.
మాటకు చిక్కని ప్రేమ
మనస్సుకు దక్కని ప్రేమ
హృదయానికి లభ్యం
భావానికి గమ్యం.
పరమాత్మ చేతల్ని చూడడు. చిత్తాన్ని చూస్తాడు.
భాగ్యాలు చూడడు. భావాలు గ్రహిస్తాడు.
భావగ్రాహి జనార్దనః



సుందర చైతన్యాశ్రమం
హైదరాబాద్ - 500 043

కృష్ణ లీలలు

స్వామి సుందర చైతన్యానంద

కృష్ణ లీలలు

కృష్ణ లీలలు

కృష్ణ లీలలు
స్వామి సుందర చైతన్యానంద
ద్వితీయ ముద్రణము } అక్టోబరు 2009
2000 కాపీలు
(సర్వ స్వామ్యములు ట్రస్ట్‌వి)
ప్రతులకు :
సర్వజ్ఞ కల్చరల్ ట్రస్ట్
సుందర చైతన్యాశ్రమం
హైదరాబాద్ - 500 043.
☎: (08418) 255777
(08418) 255355
డి.టి.పి. & కవర్ డిజైనింగ్
సుందర చైతన్యాశ్రమం

స్వామి సుందర చైతన్యానంద

నివేదన

కృష్..... అంటే సత్తా. ణ...... అంటే ఆనందం. కృష్ణ అంటే సదానంద స్వరూపము.

కృషి ర్భూవాచకః శబ్దో ణశ్చ నిర్వృతి వాచకః
విష్ణు స్తద్భావ యోగాచ్చ కృష్ణో భవతి శాశ్వతః

ఇతి వ్యాస వచనాత్........ సచ్చిదానందాత్మకః - తద్భావయోగాచ్చ........ సత్తా, ఆనందం కలసి ఎవరి లక్షణములో అతడే విష్ణువు. అతడే శాశ్వతుడైన శ్రీకృష్ణుడు. కనుక కృష్ణుడంటే సదానందరూపుడు. సచ్చిదానంద స్వరూపుడు. స్వభావాన్ని, స్వరూపాన్ని దాచటం సాధ్యం కాదు. చక్కెరతో తయారైన బొమ్మల రూపాలు వేరువేరుగా ఉండొచ్చు. కాని వాటి లోని తీపి ఒక్కటే. తీపి పదార్థాలలో తీపిని దాచటం ఎవరికీ సాధ్యం కాదు.

పరమాత్మ సచ్చిదానంద స్వరూపుడు. ఆయన ఏ అవతార మెత్తినా సచ్చిదానంద లక్షణము దాగేది కాదు. అలా శోభించే అవతారాలలో దివ్య మైనది శ్రీకృష్ణావతారము. పరిపూర్ణావతారము. అందుకే కృష్ణస్తు భగవాన్ స్వయమ్ అని భాగవతం కీర్తించింది.

జగన్నాథుడైన శ్రీకృష్ణుని స్మరించి, కీర్తించి, ధ్యానించి బ్రతుకును భగవన్మయం చేసుకొనేందుకు ఉపకరించే పుస్తకమే ఈ 'కృష్ణలీలలు'.

'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే ద్వాదశాక్షరీ మహామంత్రమే కృష్ణ మంత్రము. బ్రతుకును కడతేర్చే పన్నెండు అక్షరముల పావనమంత్రము.

అలాగే పన్నెండు లీలలను భావాత్మకంగా విశ్లేషించి వివరించే పుస్తకమే ఈ కృష్ణలీలలు.

నామామృతంలో నాలుకను తడుపుకొంటూ కథామృతంతో హృదయాన్ని పవిత్రం చేసుకొనేందుకు ఈ చిన్ని పుస్తకము పెద్దగా ఉపయోగ పడుతుందని భావిస్తున్నా.

మీ
స్వామి సుందర చైతన్యానంద

విషయ సూచిక

1. శ్రీకృష్ణ జననము 5

2. పూతనా సంహారము 9

3. గోవర్ధన గిరిధారి 13

4. చైతన్య మురళి 18

5. చోరలీల 22

6. మృద్భక్షణము - విశ్వరూప దర్శనము 26

7. కాళియ మర్దనము 28

8. పూజాఫలము 30

9. గోపికా వస్త్రాపహరణం 34

10. భగవత్కృప 38

11. గోపికాగీతం 41

12. కృష్ణస్తు భగవాన్ స్వయం 45

శ్రీకృష్ణ జననము

ప్రేమ ఒక వస్తువు కాదు. ఏ వస్తువుకూ సంబంధించింది కాదు. కాని, ఏ వస్తువులో కలిపినా కలసి పోతుంది. కలసి ఉంటుంది. అదే ప్రేమలో కోమలత్వం. కోమలమైన ఈ ప్రేమను ఎక్కడ కలపాలో, ఎలా కలపాలో తెలిసి కలిపే నైపుణ్య ముంటే, ఆ తరువాత బ్రతుకంతా ప్రేమతో నిండి పోతుంది. అత్త, మామ, అక్క, బావ, భర్త, మరిది అందరూ భోజనానికి పంక్తిలో కూర్చుంటే, వడ్డించే స్త్రీ అందరికీ అన్ని పదార్థాలు సమంగా వడ్డిస్తూ పోతుంది. భర్తకు వడ్డించే టప్పుడు పదార్థము అదే అయినా, ప్రేమతో వడ్డిస్తుంది. ఆమె చూపులు మొదలుకొని గెరిటె చలనం వరకు ప్రేమ కదుల్తూనే ఉంటుంది. పదార్థముతో పాటు ప్రేమను కూడా భర్తకు వడ్డిస్తుంది. అయితే, అదే భర్తలో పరమాత్మను దర్శిస్తూ పెట్టగలిగితే, ఆ భర్త కళ్ళల్లో నుండి పరమాత్మ తొంగి చూస్తాడు. అదే ప్రేమతో అందరికీ పెట్టగలిగితే, అందరినీ చూడ గలిగితే, అది విశ్వప్రేమగా మారుతుంది.

ప్రేమ ఎక్కడైనా కలసి పోతుంది. అలాగని ఎక్కడంటే అక్కడ కలప కూడదు. పరమాత్మ లోనే విలీనం చేయాలి. నిమగ్నం చేయాలి. అదే భక్తి. భక్తి కొరకు సంబంధాలను త్రెంచుకో నవసరం లేదు. భక్తిని రంగరించుకొంటే సరిపోతుంది. కొందరు పరమాత్మను తండ్రిగా భావిస్తారు. కొందరు తల్లిగా భావిస్తారు. తల్లిదండ్రులను ప్రేమించటానికి, పరమాత్మను తల్లిదండ్రిగా ప్రేమించటానికి తేడా ఏమిటి? ఏమీ లేదు. ప్రేమ రూపమైన భక్తిని కలపటమే. అదొక్కటి జరిగితే అంతా జరిగి పోతుంది. శ్రీకృష్ణ పరమాత్మను బిడ్డగా ప్రేమించే భాగ్యం, సేవించే అదృష్టం నందయశోదలకు, దేవకీవసుదేవులకు ప్రాప్తించింది. ఇదే వాత్సల్యభక్తి.

అష్టమి తిథి. అర్ధరాత్రి సమయం. ప్రపంచమంతా నిద్రాదేవి ఒడిలో ఆదమరచి నిద్రిస్తోంది. దేవకీవసుదేవుల పుణ్యఫలం, తపోఫలం పరమాత్మ దేవకీదేవి ఒడిలో మేల్కొని చూస్తున్నాడు. ఆకాశంలో అర్ధచంద్రుడు కనిపిస్తున్నాడు. భూమిపై పూర్ణ చంద్రుడు, కృష్ణచంద్రుడు దర్శన మిస్తున్నాడు. దేవకి ప్రసవించింది. అయితే కృష్ణుడు పుట్టినట్లేనా? ఏమో! శ్రీకృష్ణుడు దేవకికి ప్రథమ సంతానం కాదు. గతంలో ఆరు మందిని కన్న తల్లి దేవకి. పూర్వ ప్రసవాల అనుభవం వేరు. నేటి ప్రసవం వేరు. గతంలో ప్రసవించే టప్పుడు గట్టున పడేసిన చేపలా గిలగిల కొట్టుకొంటూ ప్రసవించేది. ఇప్పుడు ప్రసవవేదనే లేదు. సంచిత కర్మలను మోసుకొంటూ, ప్రారబ్ధం పంచిపెట్టే శుభాశుభ ఫలాలను అనుభవిం చేందుకు జన్మించే జీవుల్ని ప్రసవించాలంటే బాధ తప్పదు.

శ్రీకృష్ణ పరమాత్మ ప్రారబ్ధాన్ని అనుభవించటానికి జన్మించ లేదు. ఎందరి ప్రార్థన లనో ఆలకించి, వారి ప్రారబ్ధాలను తుడిచేందుకు, కడిగేందుకు ఆవిర్భవించిన అవతార

మూర్తి. అందుకనే అది లీలాశరీరం. అవిసిపువ్వు వంటి శరీర కాంతితో, చతుర్భుజుడై, శంఖచక్రగదా పద్మాలతో శోభిస్తూ జన్మించాడు.

నిశీథే తమ ఉద్భూతే జాయమానే జనార్దనః - మునయః దేవాః ముదాన్వితాః

నిశీథే=అర్ధరాత్రి, **తమ ఉద్భూతే**=కటికచీకటి క్రమ్మినట్లు, **జాయమానే జనార్దనః**= పరమాత్మ పుట్టగనే, **మునయః**=మునులు, **దేవాః**=దేవతలు, **ముదాన్వితాః**=దివ్యానందాన్ని అనుభవించారు. వసుదేవుడు బిడ్డరూపంలో ఉన్న పరమాత్మను చూచి

విదితోసి భవాన్ సాక్షా త్పురుషః ప్రకృతేః పరః
కేవలానుభవానంద స్వరూపః సర్వ బుద్ధి దృక్

భగవాన్! సమస్త బుద్ధి వృత్తులకు సాక్షి యైన పరమాత్మగా, సత్యజ్ఞానానంద స్వరూపునిగా, పురుషోత్తమునిగా నిన్ను తెలుసుకొను చున్నాను. **ధన్యోస్మి!** అని ప్రార్థించాడు.

గత జన్మలలో దేవకీవసుదేవులు ఆచరించిన తపస్సును, తపోఫలంగా తాను లభించిన విధమును పరమాత్మ వారికి విశద పరచాడు. దేవకీవసుదేవులు పుణ్యాత్ములు. తపోధనులు. కారాగృహంలో ఉన్నా పరమాత్మ ధ్యానం లోనే జీవించారు. అందుకే వారికి పరమాత్మ పుత్రుడుగా జన్మించాడు. బాధలు మనిషికి క్రొత్తవి కావు. కష్టాలు నూతనంగా వచ్చేవి కావు. కన్నీళ్ళు అందరికీ పరిచయ మైనవే. ప్రతి మానవ హృదయం ఒక కారాగృహమే. బాధల చెరసాలే. బ్రతుకులో బాధలున్నా బుద్ధిలో భగవంతుణ్ణి నింపుకొని జీవించే వారికి పరమాత్మ తోడై రక్షిస్తాడు. నీడై చల్లగా కాపాడుతాడు.

గజేంద్రుని ఉద్ధరించాడు. జటాయువును తరింప చేశాడు. శబరిని కరుణించాడు. ద్రౌపదిని కనికరించి రక్షించాడు. నిండుసభలో పండ్లతొక్కలు ఒలిచినట్లు దుష్టుడైన దుశ్శాసనుడు ద్రౌపది వలువల్ని తొలగిస్తూ ఉంటే, దయామయుడైన పరమాత్మ, తల్లి తన బిడ్డను కడుపులో పెట్టుకొని రక్షించినట్లు ద్రౌపదిని కాపాడాడు. వాసుదేవుడే వస్త్ర మయ్యాడు. భక్తిని ఆశీర్వదించాడు. అహంకారాన్ని అణచి వేశాడు. ఈ సన్నివేశాన్ని సంత్ సూరదాస్ ఎంతగానో పరవశించి గానం చేశాడు.

పల్లవి: **సునేరి మైనే**
నిర్బల్ కే బల్ రామ్ ॥ సునేరి ॥

చరణములు:
పిఛ్లీ సాఖ్ భరో సంతన్ కీ
ఆదే సవారో కామ్ ॥ సునేరి ॥
దృపద్ సుతా నిర్బల్ భయి తాదిన్
గెహలాయే నిజ్ ధామ్
దుశ్శాసన్‌కీ భుజా థకిత్ భయి
వసన్ రూప్ భయె శ్యామ్ ॥ సునేరి ॥

మానవ రూపంలో మాధవుడు గోచరిస్తున్నాడు. పరమాత్మను బిడ్డగా పొందిన దేవకి సత్యస్వరూపాన్ని అర్థం చేసుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతూ ఉంది. బిడ్డగా చూద్దామంటే, భగవంతుడుగా చతుర్భుజుడై కనిపిస్తున్నాడు. భగవంతునిగా చూద్దామా అంటే కన్నబిడ్డపై పుత్రవాత్సల్యం ముంచుకొచ్చి మనసును ముద్దముద్దగా తడిపేస్తుంది. ఏమి చేయాలో తోచక చేతులెత్తి నమస్కరించింది. తల్లిదండ్రుల స్థితిని పరమాత్మ గ్రహించాడు.

యువాం మాం పుత్ర భావేన బ్రహ్మ భావేన చాసకృత్
చింత యన్తౌ కృతస్నేహౌ యాస్యేథే మద్గతిం పరామ్

'తల్లిదండ్రులారా! నేను మీకు పుత్రుణ్ణి అనిపిస్తే, మీ పుత్రుడే పరమాత్మ అని భావించండి. భగవంతుణ్ణి అనిపిస్తే భగవంతుడే మీ పుత్రుడుగా పుట్టాడని భావించండి' అని దేవకీ వసుదేవుల్ని ఆశీర్వదించాడు. తమ బిడ్డ భగవంతుడే అని తెలుస్తున్నా, పుత్ర వాత్సల్యం దేవకి హృదయంలో భయాన్ని దింపింది. కంసుని వలన తన బిడ్డకు ఏ ప్రమాదం జరుగుతుందో అని కలత పడుతోంది. అలౌకిక మైన చతుర్భుజ రూపాన్ని ఉపసంహరించుకో మని ప్రార్థించింది.

ఉపసంహార విశ్వాత్మన్ అదో రూపం అలౌకికమ్
శంఖ చక్ర గదా పద్మ శ్రియా జుష్టం చతుర్భుజమ్

అలాగే ఉపసంహరించుకొని సాధారణ మానవాకృతిలో గోచరించాడు. అంతే కాదు. 'కంసుని వలన మీరు భయపడేటట్లయితే, నన్ను గోకులానికి చేర్చండి' అని ఆజ్ఞాపించాడు.

వసుదేవుడు ఎంత పుణ్యాత్ముడో, పరమాత్మను తలపై ఉంచుకున్నాడు. సూర్య రశ్మి చీకట్లను చీల్చినట్లు తాళాలు వేసియున్న తలుపులు తమంతట తాము తెరుచు కున్నాయి. పరమాత్మను బుద్ధిలో నిలుపుకోవాలే గాని కారాగృహ ద్వారాలే కాదు కైవల్య ద్వారాలు కూడా తెరుచు కుంటాయి అనేది మహాత్ముల అనుభవం. పుట్టిన కొన్ని క్షణా ల్లోనే దూరమై పోతున్న బిడ్డను చూచి సుడిగాలికి ఊగే వృక్షంలా దేవకి చలించి పోయింది. తెగిన తీగలా క్రిందపడి పోయింది. వసుదేవుడు తన ప్రాణాన్నే తీసుకొని పోతున్న ట్లనిపించింది.

వసుదేవుడు వెళ్ళాడు. తానొక్కతే చెరసాలలో ఉంది. బోరున విలపిస్తోంది. కన్నా! అమ్మను వదలి వెళ్తున్నావా! నీ ముద్దుముచ్చట్లకు నోచుకోని దౌర్భాగ్యురాలిని. నాన్నా! నేను బంధీని. ఏమీ పెట్టలేని దాన్ని. సుఖపెట్టలేని దాన్ని. ఆటబొమ్మలు కొనిపెట్టలేని దాన్ని. కాని తెల్లని, చల్లని నా మనసును నీకు అందిస్తున్నా, ఆడుకో. నా హృదయం అనే వెన్నను సమర్పిస్తున్నా. అందుకో!

పల్లవి: **ఒద్దురా కన్నయ్యా! నన్ను ఒదలి**
పోవద్దురా కన్నయ్యా!

అనుపల్లవి: వేడే వారిని, నిను వీడని వారిని
ఏడిపించే వేడుక ॥ ఒద్దురా ॥
చరణము: నా బ్రతుకే పూచిన మల్లిక
ఏనాడో నీకది కానుక
నిలకడగ నిలవాలి వాడక
ఊడే వాడే ఓడు జీవితం ॥ ఒద్దురా ॥

అనుకూల ప్రతికూలాలు జీవితంలో తప్పవు. ప్రతికూలమే లేకపోతే అనుకూలానికి అర్థమే లేదేమో! దుఃఖమే లేకపోతే సుఖ మెలా ఆనందమో ఎలా తెలుస్తుంది? ఎండలే లేకపోతే వర్షాలెలా కురుస్తాయి? ఎంతవారి కైనా ఎడబాటు తప్పదు ఈ ప్రపంచంలో.

కన్నంత మాత్రాన కలసి ఉండాలని ఎక్కడుంది? ఉన్నవి ఉంటాయి. ఎప్పుడూ మనవిగా, మన వద్దే ఉంటాయని చెప్పలేము. అదృష్టాలు కలిసొచ్చినా కొందరికి ఎక్కువ కాలం నిలవవు. కనుమరుగై కన్నీళ్ళను తోడుగా ఉంచుతాయి. కలతలు మంచివి కాక పోవచ్చు. కన్నీళ్ళు చెడ్డవి కావు. దూరమైన వాటిని దగ్గరకు చేర్చేవి కన్నీళ్ళే. కన్నీళ్ళలో తొణికిస లాడేవి కమనీయ స్మృతులే.

భగవంతుడు బిడ్డగా పుట్టినా, దేవకికి బాధలు తప్పలేదు. కన్నీళ్ళు దూరం కాలేదు. అంతే. ప్రారబ్దాలు ఆడిస్తూ ఉంటాయి. పరిస్థితులు ఆడుతూ ఉంటాయి. ప్రేక్షకుల్లాగా జీవులు చూస్తూ ఉండాల్సిందే. ఇవన్నీ కర్మఫలాలు. అనుభవించేందు కున్నాయే గాని అడ్డుకొనేందుకు లేవు. ప్రారబ్ధం దుఃఖాన్ని పంచితే, దుఃఖాన్ని సహించే శక్తిని పరమాత్మ మనకు అనుగ్రహించాడు. అదే శ్రీరామరక్ష. లేకపోతే, గాలిబుడగల్లా గుండెలు పగిలిపోయే వేమో!

ఒక వైపు దుఃఖ పడుతూనే, మరో వైపు పరమాత్మ ధ్యానాన్ని నిరాటంకంగా సాగిస్తోంది దేవకీదేవి. నారాయణుని దర్శించిన నేత్రాలు, మనస్సు మరో రూపాన్ని చూడలేని, స్మరించలేని స్థితిలో ఉన్నాయి.

తదేవ అవలోకయతి - తదేవ చిన్తయతి

దేవకి నేత్రాలలో కృష్ణరూపమే నిలిచి పోయింది. ఆమె మనస్సులో కృష్ణ స్మరణమే మిగిలి పోయింది.

ఇది వాసుదేవునిపై దేవకీదేవి కున్న వాత్సల్యభక్తి. హృదయంలో క్షణం కూడా పరమాత్మ దూరం గాని పవిత్రానుభూతి. కృష్ణుడు దూరం కాగానే మధుర చిన్నబోయింది. చేదుగా మారింది. కృష్ణుడు ప్రవేశించ గానే నందగోకులం ఆనంద గోకులంగా ఎలా మారిందో చూద్దాం.

పూతనా సంహారము

మనిషికి ప్రేముంది. అలాగే పలుకూ ఉంది. కాని, ప్రేమను పలుకుల్లో మడత పెట్టడం మనిషికి సాధ్యం కాదు. అందుచేతనే, ప్రేమకు అర్థమున్నా, అది శబ్దంలో ఇమడటం లేదు. మాటకు చిక్కని ప్రేమ, మనస్సుకు దక్కని ప్రేమ - హృదయానికి లభ్య మవుతుంది. భావానికి గమ్య మవుతుంది.

మనిషిని గాడిద అని పిలవటం తిట్టు. అదే సన్నిహితులు ప్రేమతో గాడిద అని పిలిస్తే అదొక గౌరవం. తండ్రి, గురువు, మిత్రుడు అలా పిలిస్తే, మనసుకు హాయిగా ఉంటుంది. బుద్ధిని బుజ్జగించిన ట్లుంటుంది.

జుట్టు పట్టి లాగటం, గిల్లటం, గిచ్చటం - ఇవన్నీ బాధించటమే అవుతుంది. కాని, పిల్లల విషయంలో మనం ఇవన్నీ చేస్తాం. పిల్లల్ని బాధించాలని ఎవ్వరూ అనుకోరు. ఈ క్రియలన్నీ పైకి బాధాకరంగా కనిపించినా, వ్యాకరణానికి అందక పోయినా, వ్యవహారంలో ఇవన్నీ ప్రేమకార్యాలు. భావపూర్ణాలు.

చిన్నవాళ్ళని 'నీవు' అని పిలుస్తాం. 'తమరు' అని కనుక సంబోధించా మంటే, వారేదో తప్పు చేసినట్లు అదోలా అయిపోతారు. ప్రేమ లేని గౌరవాలు ఎవరికి రుచిస్తాయి? కళ్ళు తెరిపించటం పుణ్యం. కళ్ళు మూయటం నేరం. పాపం. కాని, స్నేహితులు మన వెనుక నిలిచి మన కళ్ళు మూస్తే, ఆ స్పర్శలో అనిర్వచనీయ మైన సుఖాన్ని పొందుతాము.

తెల్లని వస్త్రాలు ధరించి వస్తున్న వ్యక్తిపై రెండు సిరాబొట్లు చిలికిస్తే, ఆ తరువాత రోదన అలా ఉంచినా, రాద్ధాంతం పెద్ద దవుతుంది. అదే వసంత నవరాత్రుల్లో రంగు నీళ్ళను ఎవరిపై క్రుమ్మరించినా, అంతటా నవ్వులే నాట్య మాడుతుంటాయి. ప్రేమ విషయంలో అదీ ఒక సిద్ధాంతంగా మారుతుంది.

ఇలా ఎంతైనా చెప్పుకొంటూ పోవచ్చు. అసలు ఉద్దేశ్య మేమిటంటే, ప్రేమున్న చోట, జ్ఞానమున్న చోట స్థూలదృష్టి పనికి రాదు. శబ్దపుష్టి సరిపోదు. ప్రేమ అనేది మాటలలో ఉండదు. వాక్కులో ఇమడదు. మనస్సులో నిలవదు. పనులకు పరిమితం కాదు. ప్రేమ హృదయానికి సంబంధించింది. జ్ఞానానికి సంబంధించింది. ప్రేమకు వెలుగులే కాని వెతలు తెలియవు. పూర్ణమే గాని శూన్యం అర్థం కాదు. ప్రేమకార్యాల్లో మాట, చేష్ట, మనుగడ అన్నీ ప్రేమే. అంతా ప్రేమకార్యమే.

హింసకు మారుపేరు కంసుడు. అతని నికృష్ట కూటమిలో శతదరిద్రాలు. సహస్రదౌర్భాగ్యులు. అందులో పూతన ఒకతె. పూతన ఒక రాక్షసి. బాలఘాతిని. శిశుఘాతకి. పిల్లల్ని చంపే పులి. బాలహంత్రి. అన్నెం పున్నెం ఎరుగని నిర్దోషు లైన బిడ్డల్ని నిర్దాక్షిణ్యంగా చంపేస్తుంది. మాయ చేస్తుంది. శిశువుల్ని మాయం చేస్తుంది. బాలఘాతిని, భయంకర రూపిణి అయిన పూతన కంసునిచే ప్రేరేపించబడి, పట్టణాలలో, గ్రామాలలో, గొల్ల పల్లెలలో సంచరిస్తూ, శిశువుల్ని మట్టుపెట్ట సాగింది.

ఈ పన్నాగ మంతా శ్రీకృష్ణుని వధించటానికే. కృష్ణుడు జన్మించాడని, ఎక్కడో జీవిస్తున్నాడని ఆకాశవాణి కంసునికి చెప్పింది. ఎక్కడున్నాడో తెలుసుకొని వధించాలి. ఈ పాపకార్యానికి నడుము బిగించిన పాపి పూతన. కృష్ణుడు శిశువుగా ఉంటాడు. అందుకని శిశువు లందరిని చంపుతూ పోతుంది.

పూతన గోకులానికి వచ్చింది. రాక్షస రూపంలో రాలేదు. భయంకరంగా కనిపించ లేదు. మాయారూపం ధరించింది. మనోహర రూపంతో, మగువలు సైతం మాయలో పడేటంతటి లావణ్యంతో గోకులంలో సంచరించింది. ఆమెను చూచి గోపభామలు ఆశ్చర్యంతో చలించి పోయారు. ఎవరీ స్త్రీ? పైగా చేతిలో పద్మం ధరించి ఉంది. లక్ష్మీదేవేనా? అని కళ్ళప్పగించి చూస్తున్నారు. అజ్ఞానం ప్రారంభంలో అందం గానే అగుపిస్తుంది.

పూతనకు నామకరణం ఎవరు చేశారో తెలియదు గాని సార్థక నామధేయురా లైంది. **పూత** అంటే పవిత్రము లేదా సత్యము అని అర్థము. **పూతన** అంటే పవిత్రము కానిది, సత్యము కానిది అని అర్థము. ఇంతకీ పవిత్ర మేది? **న హి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే.** ఈ విశ్వంలో జ్ఞానంతో సమానమైన పవిత్ర వస్తువు లేదు అని భగవద్గీత. పవిత్ర మైనది జ్ఞాన మొక్కటే. అపవిత్ర మైనది అజ్ఞానము. అదే పూతన. ఈ మొద్దు ఘటానికి అందమైన ముద్దుపేరు.

అజ్ఞానానికి జ్ఞానము విరోధి. అపవిత్రురా లైన పూతనకు పావనాత్ము డైన శ్రీకృష్ణ పరమాత్మ విరోధి. పూతన అందంగా అగుపించింది. చక్కగా భాషించింది. అజ్ఞానము కూడా మొదట అందంగా అగుపించి, ఆహ్లాదంగా మాట్లాడుతుంది. ముందు అమృత వాక్కులు. వెనుక విషభాండాలు. అజ్ఞానము ఎక్కడైనా ఇదే చేస్తుంది. పూతన కూడా అదే చేసింది. గోకుల మంతా సంచరించి, గోవిందుడు శయనించి యున్న యశోద ఇంటికి వచ్చింది. ఆమె అందాన్ని చూచి యశోదా రోహిణులు కళ్ళప్పగించుకొని చూస్తూ ఉండి పోయారు.

'అమ్మా! మీ జన్మే ధన్యము. ఎలాంటి బిడ్డను కన్నారు! మేము ఉన్నా మెందుకు? భూమికి భారం - గాలికి అడ్డం. ఇలాంటి బిడ్డకు పాలిచ్చే తల్లుల జన్మమే ధన్యము. మీరు అంగీకరిస్తే, అనుగ్రహిస్తే మీ బిడ్డకు కాసిన్ని పాలిచ్చి నా జన్మను కడతేర్చు కుంటాను' అని పొగడటం ప్రారంభించింది పూతన. పాపం! యశోదా రోహిణీలు అందమైన స్త్రీ పొగిడే సరికి ద్రవించి పోయారు. 'అలాగే' నని ముక్కుపచ్చ లారని పసి కందును పాపిష్టి దైన పిశాచానికి అందించారు. తెలియకుండా ఆపదలో చిక్కుకున్నారు.

ఇక్కడ మనం ఒక్క విషయం గ్రహించాలి. కాదు, ఒక్క సత్యాన్ని వంట బట్టించు కోవాలి. యశోదారోహిణీలు మోసపోవటానికి రెండే ప్రబల కారణాలు. (1) పూతన అందం. అందాన్ని చూచి కళ్ళు మోస పోయాయి. (2) పూతన భాషణం. పొగడ్తలను

విని చెవులు వంచింప బడ్డాయి. కనిపించే దంతా కమనీయం కాదు. వినిపించే దంతా విశిష్టమూ కాదు. పొగడ్తలు ఎవరి నైనా పాతాళానికి మోసుకొని పోతాయి. రూపాలను చూచి భ్రమించ కూడదు. పొగడ్తలను విని మోసపో కూడదు. ఎవరైనా మనల్ని పొగిడితే వారిలో పూతన ఉందో లేదో మనం కాస్త అంతరేక్షణ చేసుకోవాలి.

మంటలు గుండెల్లో ప్రవేశించటానికి కళ్ళు, చెవులే ప్రధాన ద్వారాలని మనం మరచిపో కూడదు. కనుకనే మన ఋషులు

భద్రం కర్ణేభిః శ్రుణుయామ దేవాః
భద్రం పశ్యేమా క్షభిర్యజత్రాః

మా చెవులు మంగళకర మైన వాటినే విను ను గాక! మా కళ్ళు మంగళకర మైన వాటినే చూచును గాక! అని ప్రార్థించారు. పూతన కృష్ణుడు పవ్వళించి యున్న ఊయలను సమీపించింది. కళ్ళారా చూచింది. ఆమెను చూచి కృష్ణుడు కళ్ళు మూసుకున్నాడు అన్నది భాగవతం.

విబుధ్యతాం బాలకా మారికాగ్రహం చరాచరాత్మా స నిమీలితేక్షణః

తాం - విబుధ్య, ఆ వచ్చిన దానిని తెలిసికొని, ఏమని? **బాలకా - మారికాగ్రహం,** పసి పిల్లల్ని చంపే శనిగ్రహం వచ్చిందని, **మారికాగ్రహం,** మాయలమారి వచ్చిందని. కృష్ణుడి కెలా తెలిసింది వచ్చింది రాక్షసి పూతన అని? **సః చరాచరాత్మా** - ఈ చరాచర ప్రపంచానికి ఆత్మ తానే కనుక. అట్టి పరమాత్మ **నిమీలిత ఈక్షణః** - కళ్ళు మూసుకున్నాడు. ఎందుకని? అజ్ఞానాన్ని చూడవద్దు అని మనకు తెలిపేందుకు. ఇది కేవలం ఉపలక్షణం. అజ్ఞానాన్ని చూడవద్దు అంటే, అజ్ఞానాన్ని వినవద్దు, అజ్ఞానాన్ని ఆలోచించ వద్దు. అజ్ఞానమును పెంచే కర్మలు చేయవద్దు అని అర్థం.

పూతన శ్రీకృష్ణుని చేతి లోకి తీసుకొంది. ఒడిలో పెట్టుకొంది. భాగవతం ఈ సన్నివేశాన్ని సున్నితమైన వేదాంత ధోరణిలో అందంగా వర్ణించింది.

అనంత మారోపయ దంక మంతకం
యథోరగం సుప్త మబుద్ధి రజ్జుధీః

నిద్రించే సర్పాన్ని త్రాడనుకొని తెలియని వాడు గ్రహించునట్లు, అనంతమైన వాడు, దుష్టుల్ని అంతం చేసే శ్రీకృష్ణుని ఒడిలో కూర్చోబెట్టుకొన్నది పూతన. ఇక కృష్ణుడెలా ఉన్నాడో తెలుసా!

మహేశ్వర త్వేపి చ బాల భావం విభావయన్ కించి దువాచ న ప్రభుః

తాను పరమేశ్వరు డైనా, బాలుడిలా నటిస్తూ నోరు మెదపకుండా ఉండిపోయా డట. అంతే. పూతన పాలిస్తోంది. గుటగుట గోవింద. ఇక అసలు రూపాన్ని ప్రదర్శిం చేందుకు సిద్ధమైంది. పాలతో పాటు విషాన్ని పంపుతూ ఉంది. దాన్నీ పానం చేస్తూనే ఉన్నాడు. విష మంతా అయిపోయింది. ఏం చేయాలో పూతనకు తోచలేదు. కాని,

కృష్ణుడికి తెలుసు. పాలు అయిపోయాయి. విషం అయిపోయింది. ఇక మిగిలింది ప్రాణాలు మాత్రమే. వాటిని తోడేస్తున్నాడు.

సా ముంచ ముంచాలమితి ప్రభాషిణీ

సా- ఆ పూతన, **ఇతి ప్రభాషిణి-** ఇలా బిగ్గరగా అరచింది. **అలం-** చాలు, త్రాగింది చాలు, **ముంచ ముంచ-** నన్ను విడువు, నన్ను విడువు అని అరచింది. 'ముంచ'లేదు. నిన్ను ముంచటమే. పంచభూతాలకు పంచటమే. నాకు పట్టుకోవడం తెలుసే గాని విడవటం తెలియదు. నేను పట్టుకోను. పట్టుకున్నానా, ఇక విడవను అని కృష్ణుడు. పూతన ప్రాణాలు పట్టు తప్పాయి. అనంత వాయువుల్లో కలిసి పోయాయి. ఇది పూతనా సంహారము. అజ్ఞాన నాశము. ఈ అద్భుతమైన సన్నివేశాన్ని చూసి నందగోకుల మంతా ఆనందంతో పరవశించి పోయింది. ఎక్కడ చూచినా వేడుకలే. ఎవరిని చూచినా వెలుగులే.

పల్లవి: **అందాల మూట - మా నోముల పంట**
మా బ్రతుకంతా తానొక వింత ॥ అందాల ॥

చరణము:

కంసుడు పంపగ ఏతెంచినది బాలఘాతిని రక్కసి పూతన
మాయమాటలతో యశోదమ్మకు విన్నవించినది నివేదన
మోసమెరుగని తల్లులిద్దరు అంగీకరించారు మాయా ప్రార్థన
పాపి పూతన గోపాలు నెత్తుకొని సాధింపసాగింది తన వంచన
విషచిత్తమును ఎరిగిన విభుడు విషగళసఖుడు గోవిందుడు
చనుబాలు త్రాగుచు పనిపూర్తి చేసె పనితన మెరిగిన ఆ బాలుడు ॥ అందాల ॥

పూతన పోయింది. గోకులంలో యాతన పోలేదు. గోపభామలలో వేదన దూరం కాలేదు. యశోదా రోహిణులలో ఆవేదన పోలేదు. రాక్షసి యైన పూతనను చూసి కృష్ణుడు భీతి చెందాడేమో? దిష్టి తీయకపోతే ఎలా? అని ఆలోచించారు స్త్రీ లందరు. ఇలా ఉంటాయి ప్రేమలు. ఇలాగే ఉండాలి కూడా. అప్పుడే అది ప్రేమవుతుంది. యశోదా రోహిణులు కృష్ణునికి రక్ష బెట్టారు. గోపభామలు కపిలగోవును తీసుకొని వచ్చారు.

రక్షాం విదధిరే గోపుచ్ఛ భ్రమణాదిభిః

ఆవుతోకను త్రిప్పుతూ రక్షబెట్టా రట. అంతే కాదు. **గోమూత్రేణ స్నాపయిత్వా పున ర్గో రజ సార్థకమ్.** జన్మ నిచ్చిన తల్లిపాలు ఒక వయస్సు వచ్చేంత వరకే త్రాగగలం. కాని గోక్షీరము జీవితాంతం పానం చేస్తాం. అమ్మ కన్నా ఆవే ఎక్కువ మేలు చేస్తుంది. కనుకనే అమ్మలు ఆవు తోకతో రక్ష పెడతారు. కాని, రక్షించే వాడికే రక్ష పెట్టటం గొప్ప విశేషం. అదే ప్రేమ వైశిష్ట్యం.

గోవర్ధన గిరిధారి

భక్తిసాధన విశిష్ట మైనది. పవిత్ర మైనది. కాని సాధకుడు వివేకవంతుడై ఉండాలి. మంచి ఒక్కటే సరిపోదు. జ్ఞానం కూడా ఉండాలి. జ్ఞానం లేకుండా ఆచరించే కర్మల వల్ల మనకు ఏదైనా లభించవచ్చు గాని పరమాత్మ లభించడు. జ్ఞానం లేని సాధనలు, మూఢాచారాలు, తెలిసీ తెలియని సాధనలు ఇవన్నీ మనల్ని ఎక్కడి కైనా తీసుకు పోవచ్చు గాని, పరమాత్మ వద్దకు చేర్చవు.

అసలు మనం ఏం చేస్తున్నామో, ఎలా చేస్తున్నామో, ఎందుకు చేస్తున్నామో, వచ్చే ఫలితం ఎలాంటిదో, ఇవన్నీ క్షుణ్ణంగా ముందే మనకు తెలిసుండాలి. దీనినే 'పురుషార్థ నిశ్చయం' అంటారు. పురుషార్థ నిశ్చయం లేకుండా చేసే సాధనలు మనిషికి జ్ఞానా న్నెప్పుడూ ఇవ్వవు; మోక్ష మార్గంలో అవి సాధకుడికి ఎప్పుడూ ఉపకరించవు. దారి తప్పితే సమస్యలు తప్పవు. జ్ఞాన మార్గమే చక్కని రాజ మార్గము. జ్ఞాతవ్యమే కర్తవ్యం. ఇదొక అందమైన మలుపు. ఒక విధంగా చెబితే పరమాత్మ పిలుపు. రిచ్యువలిజమ్ నుండి స్పిరిచ్యువలిజమ్ వైపుకు తిరగ వలసిన తియ్యని వలపు.

ఈ ప్రపంచంలో ఏదైనా వినియోగమే. విని అర్థం చేసుకోవడమే మన పని. ఇది జరిగితే బ్రతుకే నైవేద్యంగా మారి పోతుంది. ఆ తరువాత ఏది లభించినా ప్రసాదంగా మిగులుతుంది. వినడానికి మన మనసు సిద్ధంగా ఉండాలి. బుద్ధి నిర్మలంగా ఉండాలి. విశుద్ధంగా ప్రసన్నంగా ఉండాలి. అంతటితో సరిపోదు. అదృష్టమో అర్హతో అది వేరే విషయం కాని, శ్రోత్రియుడై ప్రామాణికంగా వినిపించే వాడు మనకు తోడుండాలి. అప్పుడే శ్రవణఫలం.

గోకుల వాసుల భాగ్యంగా, వాళ్ళ పుణ్యఫలంగా, తపః ఫలంగా శ్రీకృష్ణ పరమాత్మ వాళ్ళకు తోడుగా ఉన్నాడు. చేయ కూడనివి ఏవో వాటిని వాళ్ళకు తెలిపాడు. చేయ వలసిన వాటిని వాళ్ళ చేత చేయించాడు. చిత్తము చిగురించేలా, చేతము పరవశించేలా వాళ్ళకు చేయూత నిచ్చాడు; చేయి పట్టి నడిపించాడు, గుట్టు తెలిపాడు. గుండెను గుడిగా మార్చాడు. ఇదే గోవర్ధన పూజనం; గోవింద దర్శనం.

నందగోకులంలో ప్రతి ఏట ఇంద్రయాగం చాలా వైభవంగా జరుగుతుంది. అలాగే ఈసారి కూడా చాలా వైభవంగా చేయాలని నందాదిగోపులు ప్రయత్నాలు చేస్తూ ఉన్నారు. ఈలోగా బాలకృష్ణుడు నందుని సమీపించి అడుగుతాడు. 'నాన్నా! ఈ ఇంద్రయాగం ఎందుకు చేస్తున్నారు? ఎవరి ప్రీతి కోసం చేస్తున్నారు? దీనికి అధికారి ఎవరు? సాధన సామగ్రి ఏమిటి? ఏ విధమైన ఫలాన్ని ఊహించి ఈ ఇంద్రయాగం చేస్తున్నారు? అసలు దీనిని ఎందుకు చేయాలి?' అని ప్రశ్నించాడు.

నందబాబా చెబుతాడు, నాన్నా! మనం ఇక్కడ హాయిగా జీవించటానికి వర్షాలే ప్రధానంగా ఉన్నాయి. వర్షాలు రావడం వలననే మనకు జీవనం కొనసాగుతూ ఉంది. ధాన్యం లభిస్తూ ఉంది. వర్షాలు మేఘాల వల్ల వస్తూ ఉన్నాయి. మేఘాధిపతి ఇంద్రుడు. కాబట్టి ఇంద్రుణ్ణి మనం అర్చించినట్లైతే వర్షాలు సక్రమంగా కురుస్తాయి. మనం ఆనందంగా జీవిస్తాం.

కనుక ఇది ఇంద్రప్రభువును సంతృప్తి పరచేందుకు ప్రతి సంవత్సరం మనం చేసుకొనే యాగం, ఇంద్రయాగం అని చెప్పాడు. వెంటనే కృష్ణుడంటాడు, 'నాన్నా! ఇది సమంజసంగా కనిపించడం లేదు. ఇది శాస్త్రీయంగా నా కనిపించడం లేదు. పైగా ఇది ఒక ఆచారంగా మీరు చేసుకొంటున్నారు. ఆచారాలు చేసుకొనేటప్పుడు అవి ఎంతవరకు శాస్త్రోక్తంగా ఉన్నాయనే విషయాన్ని మనం ఆలోచించుకోవలసిన అవసరం ఉంది. మీరు చెప్పారు వర్షాల వలన మనం జీవిస్తూ ఉన్నామని. ఇది సామాన్యమైన విషయం నాన్నా! ఎందుకంటే, వర్షాలు కురుస్తాయి. పైగా ఇదొక ప్రత్యుపకార చర్యగా నాకు అనిపిస్తూ ఉంది.

సముద్రాలు మేఘాల్ని తయారు చేస్తూ ఉన్నాయి. మళ్ళీ మేఘాలు వర్షించి సముద్రాల్లోకే వెళుతూ ఉన్నాయి. ఇవి ఉపకార ప్రత్యుపకారాలుగా జరుగుతూ ఉన్నాయి. మన కొక్కరికే కాదు. ఆచారం అంటే వేరే విషయం కాని, ఇక్కడ మనం విచారాన్ని కూడా పెంచుకోవలసిన అవసరం ఉంది. మనం కొండ ప్రాంతంలో జీవించే వాళ్ళం. మనం ఇక్కడ దేని మీద ఆధారపడి ఉన్నాము? గోసంపద మీద ఆధారపడి ఉన్నాము. గోధనమే మనకు ప్రధానంగా ఉంది. గోవులు చక్కగా సంరక్షింప బడటానికి వాటికి కావలసిన తృణమంతా ఎక్కడి నుండి లభ్యమౌతుంది? గోవర్ధన పర్వతం నుండి లభ్య మవుతుంది.

గోవర్ధననాథుడే మనకు పరమాత్మగా నాకు గోచరిస్తూ ఉన్నాడు. ఇంద్రుడి కోసం చేసే ఇంద్రయాగాన్ని ఆపి, గోవర్ధన పూజ చేస్తే మంచిదని నా ఉద్దేశ్యం. ఈ గోవర్ధనగిరి ఏదో కాదు, జగన్నాథుని యొక్క స్వరూపం. ఈ విశ్వానికి పరమాత్మ ఎప్పుడైతే కారణమై ఉన్నాడో కార్యరూపంలో ఉన్నదంతా పరమాత్మే గనుక, ఎక్కడ మనకు అనుకూలమైన పరిస్థితుల్లో ఏ విధమైన ప్రయోజనం లభించినా అది భగవత్ప్రసాదంగా భావించాలి. భగవత్స్వరూపంగా భావించాలి.

కనుక ఈ గోవర్ధననాథుడే జగన్నాథుడు అని నా అభిప్రాయం. ఆయనే మనకు దిక్కు. మనకు దిక్కైనటువంటి ఈ గోవర్ధననాథుడు, జగన్నాథుడు అందరికీ దిక్కై ఉన్నాడు నాన్నా! ఇంద్రునికి కూడా ఆయనే దిక్కు. అన్ని దిక్కుల్లో తానే ఉన్నాడు. తూర్పున జగన్నాథుడు తానే, దక్షిణాన రంగనాథుడు తానే, పడమట ద్వారకానాథుడు తానే, ఉత్తరాన బదరీనాథుడూ తానే. ఈ గోవర్ధనరూపంలో గోచరించే, వ్యక్తమయ్యే జగన్నాథ స్వరూపాన్ని మనం అర్చిస్తాం నాన్నా!' అని తెలియజేశాడు. సశాస్త్రీయ మైన

అవగాహనను ఎప్పుడైతే శ్రీకృష్ణపరమాత్మ అందించాడో నందాదిగోపు లందరూ అంగీకరించారు.

ఈ మార్గం లోనే ఈసారి వైభవం చేసుకోవాలి, పండుగ జరుపుకోవాలి అని నిర్ణయించుకున్నారు. అప్పుడు కృష్ణుడు అంటాడు. 'నాన్నా! మనం కొండ ప్రాంతంలో ఉన్నాం. కనుక విప్ర, గో, పర్వత పూజ ప్రధాన మైనదిగా నాకు తెలుస్తూ ఉంది. ఈ గోవర్ధన నాథునికి పూజ చేసే సమయం లోనే మనకు హితం కోరే పురోహితులు, బ్రహ్మజ్ఞానులు అందరినీ పిలిచి దక్షిణలిస్తాం. వారిని పూజిస్తాం. గోవులు ప్రధానంగా మనల్ని పోషిస్తున్నాయి గనుక గోపూజ చేస్తాం. అట్లాగే పర్వతం వీటన్నిటికీ ఆధారంగా ఉంది గనుక గోవర్ధననాథునికి కూడా పూజ చేస్తాం' అని తెలియజేసి,

ఏత న్మమమతం తాతా క్రియతాం యది రోచతే

ఇది నా అభిప్రాయం నాన్నా! ఏదైతే నీకు ఇష్టంగా ఉంటుందో అది నీవు చెయ్యవచ్చు. నేను చెప్పానని నీవు చేయవలసిన అవసరం లేదు, అని శ్రీకృష్ణ పరమాత్మ తెలియజేశాడు.

గోవర్ధనపూజ ఎలా విశిష్టమైన ఆరాధనో తెలియజేసిన తరువాత నందాది గోపులంతా అంగీకరించి గోవర్ధనపూజ అత్యంత వైభవోపేతంగా జరిపారు. ఈ గోవర్ధన పూజతో గోవర్ధననాథుడు కూడా చలించాడు. ఆయన స్పందనలో గోవర్ధన పర్వతం నుండి యమునా జలాలు స్రవించాయి. దానినే 'మానసగంగ' అని పిలుస్తారు. ఈ విధంగా గోవర్ధననాథుని యొక్క పూజ చేసి, దివ్యమైన ఫలాన్ని నందాది గోపులందరు పొందారు.

గోవర్ధన పర్వతం నుండి స్రవిస్తున్న మానసగంగకు అందరూ నమస్కరించి తల మీద చల్లుకొని పానం చేశారు. ఈ లోగా ఒక విచిత్రం జరిగింది. శ్రీకృష్ణ పరమాత్మ ఒక అద్భుతమైన రూపాన్ని ధరించి వారి ముందు నిలబడి, 'చూడండి! గోవర్ధననాథుని పూజను మీరు చేశారు. ఇపుడు నేనే ఆ గోవర్ధననాథుడు, నేనే ఆ జగన్నాథుడు, నన్ను కూడా అర్చించండి' అని పలికాడు. వెంటనే నందాదిగోపు లందరూ అక్కడ చేరి పరమాత్మను అర్చించారు. పాదాలకు మ్రొక్కి నమస్కరించారు. శ్రీకృష్ణ పరమాత్మ తాను కూడా తన పాదాలకి నమస్కరించుకున్నాడు.

ఇదంతా వ్యాసభాగవతంలో ఉంది. గోవర్ధననాథుని పూజ చేసిన తరువాత జగన్నాథుని మనం అర్చిస్తాం గాని, జగన్నాథుడి కన్నా నేను వేరుగా ఉన్నానన్న భావనను కలిగి ఉంటాం. జగత్తు జగన్నాథుని యొక్క స్వరూపం. పరమాత్మ నుండి దేనినీ వేరు చేయలేము. అనంతుడైన పరమాత్మలో ఏది కూడా భిన్నంగా ఉండే అవకాశం లేదు.

కనుక పూజ చేసే సమయంలో పరమాత్మ యొక్క దివ్యమైన వైభవాన్ని, అనంత శక్తిమత్వాన్ని దృష్టిలో పెట్టుకొని మనం పూజ చెయ్యవచ్చు నేమో కాని, ఒక దశలో ఎవడైతే పూజ చేస్తున్నాడో ఆ అర్చకుడు కూడా అర్చనలో విలీనమై పోవాలి. తాను

కూడా పరమాత్మలో స్వరూపంగా మారిపోవాలి. జీవభావం నశించాలి. తానే పరమాత్మ స్వరూప మనే దివ్యమైన అవగాహనని ఈ విధంగా అక్కడ అందించాడు శ్రీకృష్ణ పరమాత్మ.

ఇలా గోవర్ధననాథుని యొక్క పూజ దివ్యంగా ముగిసింది. అందరూ ఆనందంగా ఉన్నారు. కాని ఒక్క వ్యక్తి హృదయంలో మాత్రం కలత ప్రారంభమైంది. అతడే ఇంద్రుడు. ఇంద్రుడు సంకల్పించాడు. వాతావరణం మారింది. ఆకాశంలో మార్పు వచ్చింది. లేనటువంటి మేఘాలన్నీ వచ్చి చేరాయి. ఉరుములు! మెరుపులు! చూస్తూ ఉండగానే ఆకాశమంతా దట్టమైన చీకటి వ్యాపించింది. కుండపోతగా వర్షం కురవడం ప్రారంభించింది. పిడుగుపాట్లతో గాలివాన ప్రారంభమైంది. ఏం చేయాలో గోపులకు అర్థం కాలేదు.

ఇంద్రుని యొక్క మనోగతాన్ని అర్థం చేసుకున్న పరమాత్మ నవ్వి, వాళ్ళందర్ని ఆశీర్వదించి, గోవర్ధన పర్వతాన్ని ఎత్తి చేతి మీద నిలబెట్టాడు. నందాది గోపులు, గోవులు ఆ పర్వతం క్రిందికి వెళ్ళారు. కుండపోతగా ఏడు రోజులు వర్షం కురిసింది. ఈ ఏడు రోజులు పరమాత్మ కొండను ఎత్తి వాళ్ళను కాపాడుతూనే ఉన్నాడు. వారికి ఇదొక దివ్యమైన అనుభూతి. భగవంతుడు అభయప్రదానం చేశాడు.

ఆపద ఏడు రోజులు కొనసాగుతూనే ఉంది. భగవంతుని యొక్క అనుగ్రహ సంపద ఏడు రోజులూ వాళ్ళకి తోడుగానే ఉంది. ఏడు రోజులు అనడంలో ఒక ఆధ్యాత్మిక సందేశం ఉంది. వారానికి ఏడు రోజులు. కనుక 'ప్రతిక్షణం భగవంతుని యొక్క కృప మన మీద వర్షిస్తూనే ఉండాలి. ఆయన అనుగ్రహఛత్రం క్రింద మనం సేద తీర్చుకోవాలి' అనేదే ఇందులో అంతరార్థం.

పల్లవి: సుందర సురభిళ యమునా తీరవనం
నంద నందనుని రసమయ రాగధనం ॥ సుందర ॥

చరణము: కొండనెత్తిన మోహనబాల
భక్తుల బరువును దించెడి లీల
శ్యామసుందరుని గాంచెడి వేళ
కంటిని మూసే రెప్పలు ఏల? ॥ సుందర ॥

ఏడు రోజులు కురిసీకురిసీ ఆకాశం కూడా అలసి పోయిందేమో, ఏం చేయాలో ఇంద్రునికి కూడా తెలియలేదు. ఆయన గర్వ మంతా అణగింది. వెంటనే క్రిందికి దిగి వచ్చి పరమాత్మ పాదాల మీద పడ్డాడు. వర్షం ఆగి పోయింది. పొంగి ప్రవహిస్తున్న నదుల యొక్క వడి తగ్గింది. మళ్ళీ పర్వతాన్ని ఎక్కడ ఉంచాలో అక్కడ పరమాత్మ పెట్టాడు. ఇంద్రుడు స్వామి పాదాల మీద పడి క్షమించ మని వేడుతూ ఉన్నాడు. ప్రార్థిస్తూ ఉన్నాడు.

నమస్తుభ్యం భగవతే పురుషాయ మహాత్మనే
వాసుదేవాయ కృష్ణాయ సాత్వతాంపతయే నమః

"హే భగవాన్! నీ యొక్క దివ్యమైన వైభవాన్ని తెలుసుకోలేని అల్పజ్ఞుణ్ణి, కించిజ్ఞుణ్ణి నేను. నీవు అనంతమైన శక్తిసామర్థ్యాలు కలిగినవాడివి. సర్వాంతర్యామివి. అందరిలో వసించేవాడివి. హే భగవాన్! నీకు నమస్కారం!" అంటూ పాదాలమీద పడి, కామధేను విచ్చిన క్షీరముతో పరమాత్మపాదాల్ని అభిషేకించాడు. ఇంద్రునికి పరమాత్మ అనుగ్రహించిన సందేశమేమిటో తెలుసా! "గతంలో చేసుకున్న పుణ్యఫల విశేషం చేత సంపదలు రావచ్చు. పదవులు రావచ్చు. గౌరవాలు కూడా రావచ్చు. కాని గౌరవాలు వచ్చాయని వాటితోపాటు గర్వం కూడా పెరిగితే ఆ తరువాత మిగిలేవన్నీ సంపదలు కావు, ఆపదలే" అని తెలిపి ఇంద్రుణ్ణి ఆశీర్వదించాడు.

పల్లవి: జలచర మృగ భూసుర నర రూపా!
గోప గోపికాజన పావనరూపా! ॥ జలచర ॥

చరణము:
గోవర్ధనోద్ధారకా! గోపీజన పాలకా!
గోకుల సంపోషకా! గోధన సంరక్షకా!
ఉరుముల మెరుపుల జడివానలతో బాధించెను సురపతి
పుట్టగొడుగువలె గోవర్ధనమును పై కెత్తితివి శ్రీపతి!
గాలికి పోయెను గర్వములు దిక్కై నిలిచెను చరణములు
నీ కరము సోకిన ఆ కొండదే భాగ్యము ॥ జలచర ॥

గోవర్ధనగిరి నెత్తిన ఈ పవిత్రలీలలో ముఖ్యంగా మనం మూడువిషయాలు అర్థం చేసుకోవాలి. మొదటిది, మూఢాచారాలు పనికిరావు; ఏది ఆచరించినా జ్ఞానంతోనే ఆచరించాలి. రెండవది, గర్వము, దర్పము, దంభము ఇవన్నీ ఎప్పుడూ పతనానికే దారి తీస్తాయి. మూడవది, భక్తి ఎప్పుడూ మనిషిని రక్షిస్తుంది.

ఈ మూడు విషయాలను గోవర్ధనలీలలో మనం అర్థంచేసుకున్నాం. ఈ విధంగా జీవితంలో జీవనసత్యాల్ని అర్థంచేసుకొంటూ తదనుగుణంగా జీవించినప్పుడే మనం మోక్షాన్ని పొందుతాం. జీవితం మహారణ్యం. జగన్నాథుడే మనకు ఏకైక శరణ్యం.

చైతన్య మురళి

ప్రగాఢమైన ప్రేమ మనకు ఎవరి మీద ఉంటుందో వారిని గూర్చి ఎవరైనా మనకు తెలియజేస్తే, వారు కూడా మన ప్రేమకు పాత్రు లవుతారు. వారితో స్నేహం మనస్సుకు ఆహ్లాదంగా ఉంటుంది. వారితో ముచ్చటించటము ఆనందంగా ఉంటుంది. వారి రాక హృదయానికి హాయి నిస్తుంది. అలాగే గతంల్లో మహాత్ములు ఉపయోగించిన వస్తువులు, వారితో సంబంధం కలిగి యున్న ప్రదేశాలు కూడా మనకు పూజనీయంగా ఉంటాయి. ఈ కళ్ళజోడు ఆ మహాత్మునిది, ఈ పాదుకలు ఆ సంత్ పురుషునివి, ఈ వస్త్రము ఆ దివ్యాత్మునిది. వారిని చూడలేక పోయినా, వారు ఉపయోగించిన పవిత్ర వస్తువుల్ని దర్శించ గలుగుతున్నాం అనుకొంటూ గగుర్పాటుతో చలించిపోతూ ఉంటాం.

ఆయా వస్తువులు జడాలే అయినా వాస్తవానికి అవి జడాలు కావు. చైతన్యాలు. వాటిపై చైతన్య ముద్ర లున్నాయి. అలాంటప్పుడు, సాక్షాత్తు పరమాత్మ దివ్య దేహంతో సంబంధం కలిగియున్న వస్తువుల్ని ఏమనాలి? అవి వస్తువులు కావు. పరమాత్మ స్వరూపాలు. వాటి దర్శనం కళ్ళకు జరిగితే, మనస్సులో పరమాత్మ స్మరణం సాగుతుంది. అలాంటి పవిత్ర ధ్యాన వస్తువు శ్రీకృష్ణుని మురళి. సర్వులను సమ్మోహింప జేసే చైతన్య రవళి. బృందావనంలో వేణుగానం; కురుక్షేత్రంలో గీతాగానం; ఇవి వేద నాదాలు. వేదాంత సునాదాలు. **వేణుర్మధురో రేణుర్మధురః** 'మురళి తీపి. శ్రీకృష్ణుని చరణధూళి తీపి' అన్నారు మధురాష్టకంలో వల్లభాచార్యులు.

మురళి - ధూళి - ఈ రెండిటి భాగ్యాన్ని భాగవతోత్తము లందరు పోటీపడి వర్ణించారు. దీనికి కారణం అనూహ్యా మేమీ కాదు. ఈ రెండూ పరమాత్మ దివ్య దేహానికి అంటుకు పోతాయి. దూరం చేసినా, మళ్ళీ మళ్ళీ అంటుకొంటూ ఉంటాయి. గోపికల భక్తి పరమోత్కృష్ట మని మహాత్ముల అభిప్రాయము. వేణువు వారిని కూడా చలింప చేసేది. వారిని కూర్చోనిచ్చేది కాదు. వంటవార్పులు చేసుకోనిచ్చేది కాదు. నిద్ర పోనిచ్చేది కాదు. హాయిగా ఉండనిచ్చేది కాదు అన్నది భాగవతం.

గోపికలు తమ ఇంటిలోని వారితో ఏదో ముచ్చటించాలని నోరు తెరిచేవారు. ఈ లోగా మురళీనాదం వినిపించేది. అంతే. పెదవులు మూత పడేవి. మనస్సు పరవశించి మూగ బోయేది. ఏదో పని చేయాలని లేచేవారు. మురళీగానం వినిపించేది. కదలికను కోల్పోయి, కొయ్యస్తంభాల వలె నిలబడిపోయే వారు. మురళీనాదం వినిపిస్తే చాలు. కళ్ళు, చెవులు, కాళ్ళు, మనస్సు - ఏవీ పని చేసేవి కావు. అన్నిటికీ తన్మయమే. హృదయ మంతా చిన్మయమే.

మురళీనాదానికి గోపుల, గోవుల, గోపికల హృదయాలు ద్రవించి పోయేవి.

నెమళ్ళు పురివిప్పి నాట్యం చేసేవి. మహర్షులు గాలి లేని చోట దీపాలు కదలనట్లు, చలనం కోల్పోయి ఉండిపోయే వారు. చెట్లు చలనాన్ని కోల్పోతే, గిరులు ద్రవిస్తూ ఉండేవి. భగవానుని అధరామృతాన్ని గ్రోలుతూ సదా పరమాత్మతో కలసి జీవించే మురళి మహాత్ములకు కూడా ధ్యానావేశాన్ని కలిగించింది. **కిమాచర దయం కుశలం స్మ వేణుః** 'ఈ వేణువు గతంలో ఏ పుణ్య మాచరించిందో?' అని ప్రశ్నించుకొనే వారు.

గావశ్చ కృష్ణ ముఖ నిర్గత వేణుగీత పీయూష ముత్తభిత కర్ణపుటైః పిబంత్యః

శ్రీకృష్ణుని మొగము నుండి బయల్వెడలి వచ్చిన వేణుగాన సుధను నిక్కబొడుచు కున్న చెవులతో గోవులు పానం చేశాయి అన్నది వ్యాసభాగవతం. అంటే, చెవులను అలా పెట్టకపోతే వీనులలో ప్రవేశించిన మురళీ గానామృతము జారి పోతుందేమో, కారి పోతుందేమో అని సంశయించి అలా చేశాయట. కనుకనే శ్రీకృష్ణుని మురళి చైతన్య రవళియై శోభించింది.

పల్లవి:

బృందావనిలో నంద నందనుని
మ్రోగిన మోహన మురళి
చైతన్య సుందర రవళి ॥ బృందావనిలో ॥

చరణములు:

ఆ రవమును విని ఆనందము గని
తన్మయమైనది గోపిక
తనువును మరచింది రాధిక ॥ బృందావనిలో ॥

ఆ రాగము విరాగము నింపగ
ఆ నాదము వికాసము దింపగ
కదిలింది చైతన్య గీతిక
అల్లింది సుందర మాలిక ॥ బృందావనిలో ॥

జీవన సరళిని పలికింది మురళి
బ్రతుకు బాటను నేర్పింది నెమలి
బోధను పలికింది నాలుక
పరవశమైనది వేదిక
పొందదగినది లేదిక ॥ బృందావనిలో ॥

మురళిలో అంతా ఖాళీయే. ఆమె ఎప్పుడూ ఖాళీ గానే ఉంటుంది. కృష్ణుడే తన అధరామృతంతో మురళిని నింపుతూ ఉంటాడు. ఊదినంత సేపే ఊరేగింపు. ఆపితే అంతా నిశ్శబ్దమే. మురళికి కర్తృత్వము లేదు. నిమిత్తమాత్రంగా చరిస్తుంది. తేలికగా ఉంటుంది. ప్రేమలో సదా తేలిపోతూ ఉంటుంది. తూలిపోతూ ఉంటుంది. తనలో తనకు ఎవరూ అడ్డులేరు. తానేమో ఎవరికీ అడ్డు కాదు. ఒడ్డు చేరే మార్గం ఇదే నంటుంది మురళి. నీవు ఖాళీగా ఉంటే కృష్ణుడు నీ లోనే ఉంటాడు అంటుంది మురళి.

పరమాత్మ ఊదితేనే మురళిలో శబ్దం. ఊదుతూ ఉంటేనే సాగుతుంది ఆ రవం. ఊదటం ఆపితే అంతా నిశ్శబ్దం, విలీనం - ఇవే సృష్టి స్థితి లయా లంటారు సదాశివబ్రహ్మేంద్ర స్వాముల వారు.

వేణు రవామృత పాన కిశోరం
సృష్టి స్థితి లయ హేతు విహారం
స్మరవారం వారం
చేతః స్మర నందకుమారమ్....

వెదురుకు పువ్వు పూయదు. కాయ కాయదు. అయినా యెద పొంగి మురళి పంట పండింది. హృదయం నిండింది. ఏమీ లేని మురళికి, ఏదీ లేని మురళికి, ఎవరూ లేని మురళికి అన్నీ మాధవుడే అయ్యాడు. **'ఓం వేణునాద విశారదాయ నమః'** అని స్తవనీయు డయ్యాడు. ఇదంతా మురళి సుకృతం.

మురళి గొప్ప తపస్వి. అందుకే పరమాత్మ చేతిలో శోభిస్తోంది. వెదురు నుండి వచ్చింది వేణువు. వెదురు వేరు కఠోరంగా ఉంటుంది. అలాంటి వేరు నుండి వచ్చినా వెదురు బోలు గానే వచ్చింది. అహంకార మమకారాల్ని ఖాళీ చేసుకొని మరీ వచ్చింది.

శస్త్రాలు ఖండించినా, గణుపులు చెక్కేందుకు అగ్నిపై కాల్చినా, ఎండలో ఎండ బెట్టినా, కాలిన ఇనుపముక్కతో రంధ్రాలు చేసినా, మారు పలుకకుండా భరించింది. పరమాత్మ హృదయాన్ని ఆకర్షించింది. అందుకే, సుకుమార మైన తన చేతి లోకి తీసుకొని పరమాత్మ మెల్లగా, చల్లగా తన వేళ్ళతో ఒత్తుతూ మురళికి బాధను ఉపశమింప చేస్తూ ఉంటాడు. కాలిన బాధను అనుభవిస్తూ ఉందనేమో, తాను నోటితో ఊదుతూ చల్లదనాన్ని కల్పిస్తూ ఉంటాడు. అది కూడా, ఒంటి కాలిపై నిలబడి చేస్తాడు. ఇదంతా మురళి చేసుకున్న పుణ్యం. మురళికి తన కంటూ ఒక రాగం లేదు. మురళి వినిపించే రాగాలన్నీ రాసవిభు డైన పరమాత్మవే. అలాగే మన నుండి కదిలే ప్రతి ఆలోచన, ప్రతి మాట, ప్రతి చేష్ట పరమాత్మ కొర్కై ఉండాలి. పరమాత్మదై యుండాలి.

ఏదైనా ఆశించవచ్చు. కాని అర్హతను సంపాదించటం ప్రధానం. మురళి లాగా అర్హులైన వారిని పరమాత్మ తనంతట తానే గ్రహిస్తాడు. అనుగ్రహించి ఆశీర్వదిస్తాడు. వారి కీర్తిప్రతిష్ఠల్ని ఇనుమడింప చేస్తాడు. మురళీధర్, వంశీధర్, వేణుగోపాల్, మురళీ మనోహర్, మురళీకృష్ణ - ఇలా అందరూ పేర్లు పెట్టుకొంటారు. మురళిని ముందు పెట్టుకొని మురిసి పోతారు. పరమాత్మ కన్నా ముందే మురళి పేరు చేరి పోయింది. ఇదంతా మురళి భాగ్యం.

మురళీనాదం అమరనాదం. అమృతనాదం. అది ఒక కాలానికి పరిమితం కాదు. ప్రతి హృదయంలో అవ్యక్తంగా సాగే అనాహత ధ్వనియే మురళీనాదం. అదే ప్రణవనాదం. మనం కదిలించే మాట, మన శబ్దం, మన రాగం - ప్రయత్నంతో సాగుతాయి. ఇవి

అహతధ్వనులు. శ్రీకృష్ణుని మురళీరవం అహతనాదం కాదు. అది అనాహతనాదం. సమస్త శబ్దాలకు ధ్వనులకు ఆధారమైన నాదం. పరమాత్మ స్వరూపం. అందుకే అంత ఆకర్షణ.

ఈ ప్రపంచంలో ఒక శబ్దం కన్నా మరొక శబ్దం, ఒక నాదం కన్నా మరొక నాదం, ఒక రాగం కన్నా మరొక రాగం - వీనులకు ఇంపుగా, సొంపుగా విందు చేస్తాయి. ఈ నాదాలన్నీ శ్రీకృష్ణుని వేణుగానం వినిపించే వరకే. ముకుందుని మురళీరవం వినిపించ గానే సర్వనాదాలు మూలుగుతూ మూల పడుతాయి. అన్ని నాదాలకు ఆధారమైన వేణుగోపాలుని మురళీనాదం ముందు ప్రకాశించ లేక వెలవెల పోతాయి. ఇదంతా మురళి వైభవం. శ్రీకృష్ణుని మురళీనాదంలో వెగటు ఉండదు. వెలితి తెలియదు. వింటున్న కొద్ది ఇంకా ఇంకా వినాలని ఉంటుంది - ఈ సుఖం ప్రతిక్షణ వర్ధమానం.

ఇది **ప్రేమకార్యం. ప్రేమైవకార్యం.** కనుక, అనుభవించ గానే అంతరించదు. అనుభూతిగా అంతర్యంలో నిలిచి ఉంటుంది. ఈ సుఖం అనుభవరూపం. శ్రీకృష్ణుని మురళీగానం రస స్వరూపము. దీనికి ఆద్యంతములు లేవు. ఇది అనంతము నుండి అనంతానికి పరుగులిడే అమృత రసవాహిని.

చోరలీల

మంగళకరమైన ఈ ప్రపంచంలో ఎన్నో అందా లున్నాయి. సౌందర్యా లున్నాయి. కాని, కొందరికి అందంగా తోచేవి మరి కొందరికి వికారంగా కనిపిస్తాయి. ఈ భేదాలన్నీ చూచే వారి మనోస్థాయిని బట్టి ఉంటాయి. ఈ కారణం చేతనే అందమైనవి కూడా కొందరికి ఆనందాన్ని పంచలేక పోతాయి. కాని, ముక్కుపచ్చ లారని పసిబిడ్డ అందరికీ అందంగా కనిపిస్తాడు. ఆనందంగా గోచరిస్తాడు. ముద్దొస్తాడు. మురిపిస్తాడు.

పిల్లల వచ్చీరాని మాటలు వీనులకు విందు చేస్తాయి. పిల్లల వచ్చీరాని నడకలు చూడ ముచ్చటగా ఉంటాయి. వారి నవ్వులో ప్రపంచ మంతా ఇమిడి పోయినట్లుంటుంది. వారి అమాయకపు చూపులు అజ్ఞాన తిమిరాలను తరిమి కొడుతాయి. బిడ్డ నవ్వినా మనకు నవ్వొస్తుంది. ఏడ్చినా వేడుక గానే ఉంటుంది. అటు పరుగెత్తి పురుషులపై పడతారు పిల్లలు. ఇటు పరుగెత్తి స్త్రీల ఒడిలో కూర్చుంటారు. వారికి లింగభేదాలు తెలియవు.

ఒకప్పుడు ముస్తాబై, అలంకరణలతో శోభిస్తుంటారు. కాని, గర్వముండదు. వెంటనే, దిగంబరులై పరుగు లెత్తుతూ ఉంటారు. కాని, లజ్జ, సిగ్గు ఎరుగరు. మానావ మానాలకు పిల్లలు అతీతులు. ఎవరిని చూచినా పిల్లలు నవ్వుతారు. నీ, నా భేదాలు లేకుండా అందరినీ సంతోష పరుస్తారు. ఎందుకనో పిల్లల్ని ఒక్క పేరుతో పిలవం. పిల్లలకు కూడా అష్టోత్తర శతనామా లుంటాయి. బుజ్జి, బుల్లి - చిన్నా, కన్నా - చిట్టి, పొట్టి - చంటి, బంటి - ఎన్నని? ఎలా పిలిచినా, పిల్లలు మన వైపు చూసి నవ్వుతారు. క్షీరసాగరంలో పవ్వళించి యున్న నారాయణమూర్తిని సహస్రనామాల్లో ఏ నామంతో పిలిచినా పలుకునట్లు, ఊయలలో పడుకొని యున్న బిడ్డను ఎలా పిలిచినా పలుకుతాడు.

అన్ని నామాలు పరమాత్మవే అయినట్లు, అన్ని పేర్లు తమవే నని బిడ్డలు భావిస్తారు. ఎలా పిలిచినా వారి మనస్సు నొచ్చుకోదు. కనుకనే, పిల్లలు దేవుడి లాంటి వారు అంటాము. కాని, దేవుడే పిల్లవాడుగా దర్శన మిస్తే ఎలా ఉంటుంది? ఇంకెలా ఉంటుంది? 'బాలకృష్ణుడు' లాగా ఉంటుంది.

పిల్లలలో అందమైన అమాయకత్వంతో పాటు సుందరమైన అనంత జ్ఞానం మిళితమై ఉంటుంది. ప్రతి చేష్టలో జ్ఞానం తొణికిస లాడుతూ ఉంటుంది. ప్రతి మాటలో ప్రేమ ఎగిసి పడుతూ ఉంటుంది. బాలకృష్ణుడు ప్రదర్శించిన లీలలన్నీ ఇలాగే ఉంటాయి.

గోకులంలో శ్రీకృష్ణ పరమాత్మ ఆడిన బాల్యక్రీడల్లో ఎన్నో అద్భుతమైన లీలలు ప్రదర్శించాడు. వాటిలో అందమైనది, ఆకర్షణీయ మైనది చోరలీల. చోరలీలలో గడుసుదనం ఉంది. గొప్పతనం ఉంది. పిల్లచేష్ట లున్నాయి. పెద్దలకు అర్థం గాని దివ్య బోధ లున్నాయి. చోరలీలలో బాలకృష్ణునితో కలసి క్రీడించిన వారు గోపబాలురు. వారి

భాగ్యం సనకసనందనాది మహర్షులకు కూడా లభించలేదని మహాత్ములు వర్ణించారు. అనుక్షణము వారికి పరమాత్మ తోనే సాంగత్యం. తినటం, వినటం, తిరగటం, ఆడటం - అన్నీ పరమాత్మ తోనే. ఈ భాగ్యం ఎవరి కుంటుంది? అందుకే వారిని 'కృత పుణ్యపుంజులు' అన్నారు పోతనామాత్యులు.

ఆచేరు ర్వివిధాః క్రీడా వాహ్యవాహక లక్షణాః

వాహ్యవాహక లక్షణాః = మోయబడే వారు - మోసే వారు అనబడే, **వివిధాః క్రీడాః** = అనేకము లైన ఆటలను, **ఆచేరుః** = ఆడేవారు.

తమ వీపుపై కృష్ణుని ఎక్కించుకొని మోసిన వారి భాగ్యాన్ని ఏమని వర్ణించాలి? **'తస్మిన్ తజ్జనే భేద అభావాత్'** - భగవంతునికి భక్తునికి తేడా లేదంటూ పరమాత్మపై ఎక్కి చరించే ఆ పిల్లల సౌభాగ్యాన్ని వర్ణింప నెవరితరము? వారు ఆచరించిన సేవలు కూడా అనితర సాధ్యములు.

పాద సంవహనం చక్రుః కేచిత్తస్య మహాత్మనః
పరేతు హత పాప్మానో వ్యజనై స్సమ వీజయన్ ॥

కేచిత్=కొందరు బాలురు, **మహాత్మనః**=మహానుభావుడైన, **తస్య**=ఆ బాలకృష్ణునికి, **పాద సంవహనం**=కాళ్ళు పిసుకుట, **చక్రుః**=చేశారు, **హతపాప్మానః**=పాపరహితులైన, **పరేతు**= మరి కొందరు బాలురు, **వ్యజనైః**=చిగురుటాకులతో చేసిన విసనకఱ్ఱలతో, **సమవీజయన్** =విసిరేవారు. వారి పుణ్యఫలంగా లభించిన సేవ లెన్నో! కనుకనే వారితో పరమాత్మ కలసి ఆడాడు. తిరిగాడు. క్రీడల ద్వారా దివ్య బోధల నందించి తరింప చేశాడు.

పల్లవి: **మువ్వల గోపాల - చిరు నవ్వుల గోపాల**

అనుపల్లవి: **ఏటికి మాటను - గాలికి పాటను**
ఓర్పుతో నేర్పిన భక్త మందార! ॥ మువ్వల ॥

చరణము: **గొల్ల పిల్లలకు అల్లరి సుద్దులు**
బుద్ధిగ నేర్పిన బాలగోపాల
ముద్దుల గోపాల
వెన్నముద్దల గోపాల ॥ మువ్వల ॥

గోపస్త్రీలు పరుగెత్తుకొంటూ యశోద వద్దకు వస్తారు. 'అమ్మా! యశోదా! నీ పుత్రుడు గోపబాలురతో కలసి సాగించే అల్లరిని మేము భరించలేక పోతున్నాము. నీ కుమారుణ్ణి అదుపు చేసుకోవాలి' అని ఫిర్యాదు చేస్తారు. 'ఇంతకీ నా బిడ్డ చేసిన నేర మేమిటి?' అని అడుగుతుంది యశోద. గోపికలు చెబుతారు.

వత్సాన్ ముంచన్ క్వచిదసమయే క్రోశ సంజాతహాసః

అసమయే=పాలు పితుకు వేళ కానపుడే, **వత్సాన్**=దూడల్ని, **ముంచన్**=విడిచేస్తూ, **క్రోశ**

సంజాతహాసః=వాటిని ఉసిగొలిపి నవ్వుతాడు. ఇలా ఎందుకు చేశావు అంటే 'నా పని అదే' అంటాడు. మాకు అర్థం కావటం లేదు అంటారు గోపికలు.

దూడలు బంధింపబడి ఉన్నాయి. వాటిని విడిచే సమయముంది. అలాగే జీవులు కర్మ బంధాలలో చిక్కుకొని యున్నారు. కర్మఫలాలను అనుభవించనిదే వారికి ముక్తి లేదు. దూడలు 'అంబ' అని కృష్ణుని పిలుస్తాయి. కృష్ణుడు వెళ్ళి వదల వలసిన సమయానికి ముందే వాటిని విడిచి పెడతాడు.

కర్మబద్ధు లైన జీవులు కూడా 'కృష్ణా! అచ్యుతా! గోవిందా! అనంతా!' అంటూ పరమాత్మను భక్తిపూర్వకంగా పిలవ గానే పరమాత్మ అనుగ్రహించి ముందుగానే కర్మబంధం నుండి విడిపిస్తాడు. నిర్ణయించబడిన కాలానికి ముందే నిర్వికల్పానందాన్ని ప్రసాదిస్తాడు. ఇది అంతరార్థం. మరొక గోపిక వచ్చి, 'అమ్మా! యశోదా!'

వారిల్లు సొచ్చి కడవల, దోరంబగు నెయ్యి ద్రావి తుది నా కడవల్
వీరింట నీ సుతుండిడ వారికి వీరికిని దొడ్డ - వాదయ్యె సతీ!

ఒక గోపెమ్మ ఇంటిలో నేతికుండను అపహరించి, నేయిని ఖాళీ చేసి కుండను పొరుగువా రింటిలో పెట్టి వెళ్ళాడట. మరునాడు నేతికుండను పోగొట్టుకున్న గోపిక తమ కుండను ప్రక్కవారింటిలో చూచి అనుమానించిందట. ఇరువురి మధ్య పెద్ద తగ వైందట.

ఆశాపరులై మానవులు సంపదను ప్రోగు చేసుకుంటారు. పోయేనాడు ఏ సంపదలు వెంటరావు. దేహము మట్టిపాలు. సంపదలు పరులపాలు. నెయ్యి అనే సంపదను పరులు అనుభవించారు. కుండ ప్రక్కింటికి చేరింది.

మన సంపదలను మరణా నంతరము పరులు అనుభవిస్తారు. కుండ ప్రక్క ఇంటికి చేరినట్లు జీవుడు మరొక ఇంటిలో పుడతాడు. ఇదే, కుండను ప్రక్కింటికి చేర్చిన లీలలోని అంతర్భావము. ఆశాజీవులకు జగడాలే, ఆగడాలే మిగుల్తాయి. అదే ప్రక్కింటి వారితో తగవు.

పరమాత్మ పూర్ణపురుషుడు. పురుషోత్తముడు. ఆప్తకాముడైన అచ్యుతునికి ఆశ లుంటాయా? కోరిక లుంటాయా? ఏదైనా లేకపోతే దానిపై కోరిక కలుగుతుంది. ఉన్నది సరిపోక పోతే ఆశ జనిస్తుంది. పరమాత్మకు లేని దేముంది? అనంతునికి అవసరా లేముంటాయి? తనది కాని దానిని అపహరించే వాడు చోరుడు. శ్రీకృష్ణుడు చోరు డెలా అవుతాడు? ఆయన కంటే వేరుగా ఏముంది? ఆయన కంటే శ్రేష్ఠమైన దేముంది?

మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయ

'అర్జునా! నా కంటే శ్రేష్ఠ మైనది మరొకటి లేదు. నా కన్నా వేరుగా ఏదీ ఉండదు' అని గీతలో భగవానువాచ.

'చోరలీల'లో అద్భుత జీవనసత్యా లున్నాయి. జీవితపాఠా లున్నాయి. ప్రతి మనిషి

హృదయంలో ప్రేముంది. ప్రేమ సున్నిత మైనది. మెత్తనిది. వెన్న లాంటిది. పరమాత్మ వైపుకు తిరిగితేనే ప్రేమకు పూర్ణత్వం. ప్రతి జీవిని పూర్ణ స్వరూపంగా మార్చేందుకు పరమాత్మ మనలోని ప్రేమను అపహరిస్తాడు. అదే చోరలీల. బ్రతుకుల్లో భారాలను, ఘోరాలను దూరం చేసే చోరలీల. శ్రీకృష్ణుడు చోరుడే. దొంగే. దొంగ అందరినీ చూస్తాడు. కాని ఎవ్వరికీ కనిపించడు. కృష్ణుడు కూడా అంతే. **దృగేవ న తు దృశ్యతే.** తాను **ద్రష్టే** గాని దృశ్యము కాదు.

హే భగవాన్! పాలకడలి నీ ఇల్లు. నీకు పాలు, వెన్న అవసరమా? భూదేవి నీ ప్రియసతి. నీకు మన్ను అవసరమా? ఇవన్నీ మా కొరకు. మూసుకుపోయిన మా కళ్ళు తెరిపించేందుకు. మా బ్రతుకులోని చీకట్లను తరిమేందుకు. వెలుగునీడల్ని దూరం చేసి దివ్యతేజంతో మమ్మల్ని నింపేందుకు. యమున చల్లన, కృష్ణుడు నల్లన, వెన్నలు తెల్లన - నీ పంచన మా బ్రతుకంతా తియ్యన!

పల్లవి: **పావన యమునా జలములు చల్లన**
మోహన కృష్ణుడు నల్లన - మన మోహన కృష్ణుడు నల్లన ॥ పావన ॥

చరణము:
క్షీరసాగర శయనా! - క్షీరమె నీకు కావలెనా?
వేదము కదిలిన నోటికి వెన్నలు మన్నులు కావలెనా?
పాలకడలిలో వెన్నకుండలలో ఉన్నది ప్రేమే చల్లన
తేనెల కన్నా తియ్యన ॥ పావన ॥

చోరలీల ఒక దివ్యలీల. వికారాన్ని తొలగించి బ్రతుకులో సౌందర్యాన్ని ప్రసాదించే ఆనందలీల. అమృతానంద లీల. పవిత్రమైన ఈ లీలలతో నందగోకుల మంతా పునీతమై పోయింది. మన బ్రతుకులు కూడా పవిత్రం కావాలి. తరించి పోవాలి. దానికి ఒక్కటే మార్గం. వెన్నను వెన్నునికి సమర్పించటమే. హృదయ మనే నవనీతాన్ని హృదయ నివాసి యైన నవనీత చోరునికి ప్రేమతో సమర్పించటమే. భక్తితో సమర్పించటమే.

మృద్భక్షణము - విశ్వరూప దర్శనము

మలిన పరచే స్వభావం గల వస్తువు శుద్ధి చేసేందుకు పనికి రాదు. శుద్ధమైన వస్తువు మలిన పరచదు. అలాగాక, శుద్ధమైన దానిని మలిన పరుస్తూ, మలినమైన దానిని శుద్ధి చేసే విచిత్రమైన వస్తువు **మృత్తిక**. అంటే మట్టి. మట్టి తగిల్తే దేహం మలిన పడుతుంది. వస్త్రం మలిన పడుతుంది. పాత్రలు మలిన పడుతాయి. మృత్తికా స్నానంతో దేహం శుభ్ర పడుతుంది. తేలిక పడుతుంది. వస్త్రం శుద్ధి అవుతుంది. మట్టితో పాత్రలూ శుద్ధి పడతాయి.

మృత్తికే హరతు మే పాపం యన్మయా దుష్కృతం కృతమ్

'నేను చేసిన పాపాలను పోగొట్టు తల్లీ!' అంటూ మృత్తికతో శరీరాన్ని శుభ్రం చేసు కుంటాము. కనుకనే, భూమిని భూమాతగా భావించి నమస్కరిస్తాము. **పాదస్పర్శం క్షమస్వమే.** 'అమ్మా! తప్పనిసరి అయింది కనుక నీ మీద కాలు పెడుతున్నా. క్షమించు' అని ఉదయాన్నే భూదేవిని ప్రార్థిస్తాము.

మన దేహంలో ప్రధానమైంది మట్టి. దేహం నిలిచేందుకు ఆధారమైన ఆహారాదులలో ప్రధానమైంది మట్టి. దేహాన్ని చాలిస్తే అది చేరేది కూడా మట్టే. మట్టి ఇంటిని గట్టి పరచేందుకు మట్టినే మెత్తునట్లు, మట్టి తోనే గోడల్ని అలుకునట్లు, ఈ మృణ్మయ దేహాన్ని మృత్తికాహారం తోనే కాపాడు కొంటున్నాము.

వెన్నంటే కృష్ణుడికి చాలా ఇష్టం. పాల నుండి వెన్న వస్తుంది. పాలు గోవు నుండి వస్తాయి. గడ్డి తింటే ఆవుకు పాలు పడతాయి. భూమి నుండి గడ్డి మొల కెత్తుతుంది. గడ్డి లోని సారము మట్టే. ఆ మట్టే పరిణామ క్రమంలో వెన్నగా మారింది. కనుక, వెన్నయినా, మన్నయినా కృష్ణుడికి ఒకటే నట. ఏవైనా కార్యా లేనట. కార్యా లేవైనా కారణమైన తన కన్నా వేరు కావట. మట్టి కూడా తనకు మృష్టాన్న మేనట. అదియే మృద్భక్షణము. ఫలితం? విశ్వరూప దర్శనము.

'అమ్మా! అమ్మా! కృష్ణుడు మన్ను తిన్నాడే!' అని బలరాముడు గోపబాలురతో కలసి వచ్చి యశోదకు ఫిర్యాదు చేశాడు. యశోద పరుగు పరుగున వెళ్ళి కృష్ణుని పట్టుకొని, 'మన్ను తిన్నావా? చెప్పు. నిజం చెప్పు' అని గద్దించింది. 'అమ్మా! నేను అబద్ధం చెప్పను. నిజమే చెబుతాను. నేను మన్ను తినలేదు. వెన్న పెట్టే తల్లివి నీవు ఉండగా మన్ను దినే ఖర్మ నా కేమిటి?' అంటాడు బాలకృష్ణుడు. 'అయితే ఈ గోపబాలు రందరు నీ మీద ఎందుకు ఫిర్యాదు చేస్తారు? అన్న బలరాముడు కూడా చెబుతున్నాడే?' అంది యశోద. 'అమ్మా! వారంతే. అలాగే చెబుతారు. వాళ్ళిక మారరు. నే నంటే వారికి గిట్టదు. అందుకనే పని కట్టుకొని చాడీలు చెబుతారు'.

నాహం భక్షితవా నంబ సర్వే మిథ్యాభి శంసినః
యది సత్యం గిరస్తర్హి సమక్షం పశ్యమే ముఖమ్

'నేను మన్ను దినలేదు. వారందరు అబద్ధాలు చెబుతున్నారు. వారి మాటలు నిజమని నీవు నమ్మేటట్లయితే నీవే నా నోటిని ప్రత్యక్షంగా చూడు' అన్నాడు బాలకృష్ణుడు. వెంటనే యశోద, అయితే నీవు మన్ను తినలేదా? **యద్యేవం తర్హివ్యాదేహి.** అదే నిజమైతే, **వ్యాదేహి**=నీ నోరు తెరువు అన్నది యశోద. బాలకృష్ణుడు నోరు తెరిచాడు. తల్లి నోటిలో చూచింది. ఏమిటి? **తత్ర దదృశే విశ్వం** - అతని నోటిలో చరాచరాత్మక మైన ప్రపంచం గోచరిస్తూ ఉంది. అంతరిక్షం అగుపిస్తూ ఉంది. పర్వత ద్వీప సముద్రాలతో గూడిన భూమండలం కనిపిస్తూ ఉంది. స్వర్గలోకము, తేజోవంతమైన అథోలోకములు, పాతాళము, దేవతలు, మరెన్నో సృష్టి కార్యాలు గోచరించాయి. ఇది పరమాత్మ యశోదా మాతకు అనుగ్రహించిన విశ్వరూప దర్శనము.

పల్లవి: **జలచర మృగ భూసుర నర రూపా!**
గోప గోపికాజన పావనరూపా! ॥ జలచర ॥

చరణము:
భక్షించితివి మన్నును - తప్పంటివి భ్రాతను
అర్థించితివి మాతను - తుడిచావు తలరాతను
వాడలు మేడలు ఆకాశ వనభూములు
జంగమస్థావర సాగరపర్వత సురలోక తేజస్సులు
ఒదిగినవి నీ నోటిలో - దాగినవి నీ కుక్షిలో
కరుణించు కమలాక్ష! జననాథ జగదీశ్వర! ॥ జలచర ॥

పరమాత్మ ఈ సృష్టికి అభిన్న నిమిత్త ఉపాదాన కారణము. కుండకు ఉపాదాన కారణమైన మట్టిని కుండ నుండి వేరు చెయ్యలేము. అలాగే ఈ సృష్టి నుండి పరమాత్మను దూరంగా ఉంచలేము. అన్నీ తన లోనే ఉన్నాయి. మట్టిపాత్ర లేవీ మట్టి కన్నా దూరంగా ఉండలేవు. ఈ సృష్టి పరమాత్మ కన్నా వేరుగా ఉండలేదు. అదే విశ్వరూప దర్శనం. జగత్తులో జగన్నాథుని దర్శనం. విశ్వనాథునిలో విశ్వదర్శనం.

పల్లవి: **ఏ గొల్లవాడో ! ఈ పిల్లవాడు**
కల్లబొల్లి మాటల చల్లనివాడు
అల్లరి చిల్లరి పనుల నల్లనివాడు ॥ ఏ గొల్లవాడో ॥

చరణము: **మన్ను తిను మొనగాడు సొగసరి వీడు**
ఇది ఏలనిన తినలే దనువాడు
తనకన్నా వేరుగ తినుటకు ఏముందని
చెల్లు పలుకుకును కల్ల తెలిసిన కపటాల జోడు ॥ ఏ గొల్లవాడో ॥

వేరుగా చూడటం, బుద్ధిలో భేదం కలిగి యుండటం భ్రాంతి. ఇదే జీవభ్రాంతి. ఈ భ్రాంతిని నిర్మూలించుకొంటే అంతా శాంతియే.

కాళియ మర్దనము

సత్య మస్తి. మాయా అస్తి. సత్యముంది. మాయా ఉంది. మూడు కాలాలలో ఉంటూ కాలాతీతంగా ఉండేది సత్యము. ఒక కాలంలో తెలిసేది మాయ. సత్యం గుణాతీత మైంది. మాయ త్రిగుణ మిళిత మైనది. సత్యము స్వప్రకాశమై భాసిస్తుంది. మాయకు ఆధారమైంది. మాయ సత్యమును ఆశ్రయించుకొని ఉంటుంది. సత్యానుభూతిలో మాయ అసత్యంగా మిగిలి పోతుంది. మాయ ఉంది అంటే హాయి లేదని అర్థం. చీకట్లు క్రమ్మినపుడు ఏదీ కనిపించదు. మాయ ఆవరించి నప్పుడు శాంతి గోచరించదు. మాయకు చేరువైన వారికి సుఖసంతోషాలు మిగలవు. ఆవేదనలు తప్పవు.

బృందావనానికి సమీపంలో కాళియమడుగనే సరస్సు ఉండేది. అందులో కాళియుడనే భయంకర సర్పరాజు ఉండేవాడు. అతడు ఉండుట చేత ఆ మడుగంతా విషతుల్యంగా మారింది. ఆ విషాగ్ని వలన నీరు కూడా వేడెక్కింది. ఆ మడుగు పైన విహరించే పక్షులు కూడా ఆ విషాగ్నిని భరించలేక మడుగులో పడి మరణించేవి. ఆ విషజలాల మీదుగా వీచే గాలి సోకితే చాలు. జంతువులు, వృక్ష లతాదులు నశించేవి. బృందావన వాసులు భయభ్రాంతులతో జీవించే వారు. వారి భయాలను పోగొట్టాలని సంకల్పించాడు బాలకృష్ణుడు.

ఒకనాడు ఆ కాళియ మడుగులో దూకాడు. కాళియుడు కృష్ణుని పైకి విష కోరలతో విజృంభించాడు. బాలకృష్ణుడు కాళియునితో భయంకరంగా పోరాడాడు. చివరికి కాళీయుడు బలహీన పడ్డాడు. శక్తిహీను డయ్యాడు. భయంతో తలవంచాడు. వంగిన కాళీయుని పడగలపై వాసుదేవుడు నిలబడ్డాడు. నాట్యం చేశాడు. కాళీయుని పడగల లోని మణులకాంతి విరజిమ్మింది. నల్లనయ్య దివ్య చరణాలు ఎఱ్ఱగా శోభించాయి. సురులు పైనుండి సుమవర్షాన్ని కురిపించారు. కాళియుడు శిరమోడ్చి నమస్కరించి, కృష్ణునికి శరణాగతు డయ్యాడు. కాళీయుడు కూడా పుణ్యాత్ముడే. పరమాత్మ పాదపద్మాలను శిరముపై ధరించాడు. **ఓం కాళీయ ఫణి మాణిక్య రంజిత శ్రీపదాంబుజాయ నమః** అని పరమాత్మను కీర్తిస్తున్నాము.

పల్లవి : **అందాల మూట - మా నోముల పంట**
మా బ్రతుకంతా తానొక వింత ॥ అందాల ॥

చరణము :

కాళియ మడుగున విషకలిత తోయమ్ము త్రాగి మూర్ఛిల్లిరి గోవులు గోపులు
అసువులు బాసిన వారిని కూడ బ్రతికించినవి గోపాలుని చూపులు
కాళింది జలమును పావనము చేయ నడుము బిగించాడు నందనందనుడు
గరుడుని వోలె కాళీయుని పట్టి పీడించ సాగాడు సుకుమార బాలుడు

కాళియనాథుడు గోకులనాథుని పదములు తలపై ధరించెను
ఆ వింతను గని అచ్చెరువొందిన సర్వలోకములు తరించెను ॥ అందాల ॥

కాళియమడుగు ఏదో కాదు. సంసారమే కాళియమడుగు. సంసారము లోని భ్రాంతియే కాళియుడు. భ్రాంతి ఉన్న చోట శాంతి ఉండదు. కాళియుని శక్తిహీనుణ్ణి చేయటమే బాలకృష్ణుని లీలావైభవము. బ్రతుకులో భ్రాంతిని దూరం చేసుకోవాలి. బ్రతుకుబాటలో సత్యమే దారిదీపం కావాలి. బాలకృష్ణుడు కాళియుని తన పాదములతో త్రొక్కి నాట్యము చేశాడు. మనం అదే చేయాలి. భ్రాంతిని నిస్సారం చేయాలి. కాళ్ళ క్రింద త్రొక్కిపట్టి, ఆనందంగా జీవననృత్యం సాగించాలి. తాను కాళియుని అశక్తుని గావించాడు. అలాగే మనం కూడా భ్రాంతిని నిర్మూలించుకోవాలని కాళియమర్దనం అనే లీల ద్వారా బోధ చేశాడు బాలకృష్ణుడు.

మన హృదయంలో మాయ ఉంది. మహేశ్వరుడూ ఉన్నాడు. మనల్ని చుట్టి యున్న మాయాచక్రాన్ని త్రిప్పేవాడు కూడా తానే. **ఈశ్వరః సర్వజ్ఞః.** ఇది సంసార చక్రము. ఈ చక్రాన్ని ఆపమని చక్రపాణినే అర్థించాలి. చక్రధారినే ప్రార్థించాలి. పరమాత్మ కృపతో మనం మాయను దాటగలం, మహిమను చేరగలం. సాధకులు హృదయాన్ని నిర్మలంగా ఉంచుకోవాలి. కాళియమడుగు లాగా విషతుల్యం కాకుండా చూసుకోవాలి. తృష్ణకు దూరం కావాలి. వీలు కాకపోతే కృష్ణుని ఆశ్రయించాలి. ఆరాధించాలి. మడుగు నుండి కాళియుని దూరం చేసినట్లు, మన హృదయం లోని భ్రాంతిని పరమాత్మ దూరం చేస్తాడు. మాయను మాయం చేస్తాడు. మహిమను ఆవిష్కరిస్తాడు. పరమాత్మ ప్రసాదించే మహిమ దివ్య మైనది. అపార మైనది. అనంత మైనది.

తాను అనంతుడు. తన మహిమ అనంతము. కనుకనే ఆయన నీలమేఘ శ్యాముడు. అల్లరివాడైన బాలకృష్ణుడు నల్లనివాడు. నలుపు అనంతానికి చిహ్నము. ఆకాశం నల్లగా ఉంది. అనంతము. సముద్రం నల్లగా ఉంది. అనంతము. శ్రీకృష్ణుడు కూడా నల్లగా ఉన్నాడు. కనుక అనంతుడు. విశాలమైన ఆకాశము, అగాధమైన సాగరము నీలి వర్ణంతో శోభిస్తూ ఎలా అనంతంగా భాసిస్తున్నాయో, వాటికి ఆధారమైన అనంత శయనుడు దివ్య తేజోమయుడై ప్రకాశిస్తున్నాడు.

పరమాత్మ ఎప్పుడైతే అనంతుడని తెలుసుకున్నామో, ఆ క్షణం నుండి బ్రతుకులో అద్వైత వెలుగులు నిండినట్లే. అనంతుడైన వానికి అన్యంగా, భిన్నంగా, అతీతంగా రెండవ వస్తువు ఉండేందుకు అవకాశము లేదు. రెండవ వస్తువు లేనపుడు మలిన పడేందుకు వీలు లేదు. కనుకనే పరమాత్మ కల్మష రహితుడు. నిరంజనుడు. ఈ సత్యాన్ని ప్రదర్శించి బాలకృష్ణుడు **శిఖిపింఛమౌళి గా** శోభించాడు. మలినం తెలియని నిర్మల ప్రాణి నెమలి. మన జాతీయ పక్షి. నిరంజనుడైన తనలో దోషాలు, కల్మషాలకు స్థానముండ దని తెలుపుతూ నెమలిపింఛంతో శోభిస్తున్నాడు. దోషాలను మనం అంతం చేయాలి. తోషాలతో, సంతోషాలతో అనంతాత్మగా శోభించాలి.

పూజాఫలము

మనిషికి ఆకలి క్రొత్త కాదు. దాహం తెలియనిది కాదు. మనిషి పుట్టిన దెప్పుడో చెప్పొచ్చు. మనిషిలో ఆకలి పుట్టిందెప్పుడో, దాహం కదిలిందెప్పుడో చెప్పలేము. ఆకలిదప్పులు తీరటం, కంటి నిండా నిద్ర పోవటం - ఇవియే కనుక జీవిత పరమావధి అయితే, అవి తీరినవా రందరు సుఖంగా ఉండాలి. తృప్తిగా ఉండాలి. అలా ఎప్పుడైతే లేరో, వారికి మరేదో తీరని ఆకలి ఉండాలి. ఆరని దాహం ఉండాలి. అది త్రోసేయటానికి వీలు లేని ఆకలి. తీసేయటానికి వీలు పడని దాహం. ఈ పిపాసను తొలగించుకొనేందుకు మనిషి పదవుల్ని ప్రేమిస్తాడు. బంధువుల్ని ప్రేమిస్తాడు. ధనాన్ని ప్రేమిస్తాడు. భార్యా పుత్రుల్ని ప్రేమిస్తాడు.

ఇదంతా అంతం లేని అన్వేషణ. అవధి తెలియని ఆవేదన. ఈ విధమైన ప్రేమలలో ఎక్కడా పూర్ణత్వం సిద్ధించదు. జీవత్వం దూరం కాదు. మనిషి ప్రేమపిపాసి. ఈ ప్రేమ పిపాస భౌతికం కాదు. మానసికమూ కాదు. ఇది పారమార్థికం. పరమాత్మ అనుగ్రహం తోనే తీరుతుంది. ఆరుతుంది. స్నేహితుణ్ణి కళ్ళతో చూస్తాము. చేయిని చాపి కరచాలనం చేస్తాము. కాని, మన మనస్సు లోని భావాలతో అతని మనస్సును కదిలిస్తాం. మన హృదయం లోని ప్రేమను మాటలలో మూటగట్టి అతని హృదయానికి తగిలేలా విసురుతాము. హృదయంతో చేయవలసిన పనులు చేతులతో చేయలేము. ప్రేమ ఎప్పుడూ అలా లోతుగా చలిస్తూ ఉంటుంది. అది అంతర్వాహిని. అంతర్యామి వైపు తెలిసో తెలియకో ప్రేమ సదా కదుల్తూ ఉంటుంది. తెలిసి నడిస్తే భక్తి. నడిచి కలిస్తే ముక్తి. ఇక్కడే ప్రేమకు పూర్ణత్వం. అప్పుడే ఆంతర్యం లోని ఆకలికి, దాహానికి ఆఖరి క్షణం.

గోవులను మేపేందుకు గోపబాలురతో కలసి గోపాలకృష్ణుడు వనానికి వెళ్ళాడు. ఎందుకనో ఆ రోజు ఎండ తీక్షణంగా ఉంది. అందరూ ఒక వృక్షచ్ఛాయలో నిలబడ్డారు. బాలకృష్ణుడు గోపబాలురతో చెబుతాడు.

పశ్యతైతాన్ మహాభాగాన్ పరార్థై కాంత జీవితాన్
వాత వర్షాతపాహిమాన్ సహంతో వారయంతి నః

ఏతాన్ పశ్యత=ఈ వృక్షాలను చూడండి. ఇవి, **మహాభాగాన్**= మహనీయములై, పూజనీయములై కన్పిస్తున్నాయి. **పరార్థ ఏకాంత జీవితాన్**=ఇతరుల క్షేమమే ముఖ్య లక్ష్యంగా పెట్టుకొని జీవిస్తున్నాయి. **వాత, వర్ష, ఆతప హిమాన్**=గాలి, వాన, ఎండ, మంచులను, **సహంతః**=సహిస్తూ, భరిస్తూ, **నః**=మనకు, **వారయంతి**=ఆ బాధ కలుగ కుండా నివారిస్తున్నాయి; అని తరువుల బ్రతుకు తెరువును వివరించాడు.

చెట్లు పరోపకారమే ప్రధాన లక్ష్యంగా కలిగి ఉంటాయి. దేనిని ఆశించవు.

లభించిన దానితో తృప్తి చెందుతాయి. వర్షపుజలాలు, సూర్యకిరణాలతో సరిపెట్టు కుంటాయి. గాలికి ఊగుతాయి. వర్షానికి తడుస్తాయి. ఎండకి ఎండుతాయి. మంచులో మగ్గుతాయి. కాని, తమ నీడలో విశ్రమించే వారికి ఈ బాధలేవీ లేకుండా చేస్తాయి. ఈ పరోపకార మంతా ఒంటికాలిపై నిలబడి చేస్తాయి. పూజకు ఫలపుష్పాదుల నందిస్తాయి. ఫలితాన్ని ఆశించకుండా ఇస్తాయి. జాతి, కుల, లింగ భేదాలు లేకుండా ఎవరి కైనా ఇస్తాయి. మనుషులకే కాదు, పక్షులకు, జంతువులకు కూడా వసతి భోజనాలను సమకూరుస్తాయి. అతిథి సేవలో తృప్తి చెందుతాయి.

పగలు, ద్వేషాలు తరువులకు అర్థం కావు. రాళ్ళతో కొట్టినా పండ్లను రాల్చి, కొట్టిన వారిని తృప్తి పరుస్తాయి. బ్రతికినంత కాలం పరోపకారంతో జీవించే వృక్షాలు, ప్రాణం పోయిన తరువాత కూడా పరోపకారం తోనే కొనసాగుతాయి. ఎండిన కట్టెలు మండుతూ వంటచెరకుగా ఉపయోగ పడతాయి. భస్మమైన తరువాత కూడా ఎరువై మొక్కల్ని, పైరును బ్రతికించి పెంచుతాయి. చెట్టులో ఉపయోగ పడనిది లేదు. అంతా పరోపకారమే. దీనికి ఆర్భాటము అవసరము లేదు. దేశకాలాదులతో పని లేదు. ఇదంతా యజ్ఞజీవనం. ఉన్న చోటే తృప్తిగా సాగించే ఉద్యోగం.

చెట్లది ఋషి జీవనం. యోగ జీవనం. కనుకనే పూర్వము గురువు లందరు తరువుల క్రిందే వసించే వారు. **మూలం తరోః కేవలం ఆశ్రయన్తః.** ఆదిగురువైన దక్షిణామూర్తి కూడా వటవృక్షచ్ఛాయ లోనే కూర్చొని బోధించాడు. యజ్ఞభావంతో జీవించటం చేత వృక్షాలు పచ్చగా ఉంటాయి. సమర్పణ భావం లేకుండా, కోరికలతో యజ్ఞాలు చేసే కర్మిష్ఠులు సంతృప్తిని పొందలేరు. పరమాత్మ కృపను అందుకోలేరు.

'కృష్ణా! మాకు ఆకలేస్తోంది. ఇళ్ళ నుండి అన్నపుమూటలు ఇంకా రాలేదు' అన్నారు గోపబాలురు. ఇదీ పద్ధతి. ఆకలైనా, ఆపదైనా, తీర్చేవాడు అచ్యుతుడే కనుక ఆయనకే చెప్పుకోవాలి. పరమాత్మకే నివేదించు కోవాలి. మన అవసరాలు పరమాత్మకు తెలియవని కాదు. అనుగ్రహించే దాత పరమాత్మే అనేది మనకు తెలియాలి. కృష్ణుడు చెబుతాడు,

'అదిగో. దూరంగా ఆ వనంలో పొగ కనిపిస్తోంది. అది హోమధూమం. అక్కడ బ్రాహ్మణులు యజ్ఞం చేస్తున్నారు. వారి వద్దకు వెళ్ళి నేను పంపించానని చెప్పి, అన్నం అడగండి; పెడతారు' అన్నాడు బాలకృష్ణుడు. గోపబాలురు వెళ్ళారు. అన్నాన్ని అర్థించారు. విప్రులు స్వర్గ కాంక్షతో యజ్ఞం చేస్తున్నారు. వారికి కోరికలే కాని సమర్పణలు తెలియవు. పెట్టేందుకు మనస్సు అంగీకరించ లేదు. పెట్టలేమని చెప్పాలంటే ధర్మహాని జరుగుతుంది. అందుకని, మారు పలకకుండా మౌనం వహించారు.

పిల్లలు వేచి చూచి విసుగు చెంది, తిరిగి వాసుదేవుణ్ణి సమీపించారు. జరిగింది చెప్పారు. కృష్ణుడంటాడు, 'మనం ఎవరిని ఏదైనా అడగవచ్చు. కాని లేదని చెప్పే హక్కు

వారికుందని మనం మరచి పోకూడదు. అయినా పాలు ఆవులిస్తాయే గాని ఎద్దులిస్తాయా? అన్నం అమ్మలే పెడతారు. ఈసారి మీరు వెనుక వైపుగా వెళ్ళి ఆ బ్రాహ్మణుల భార్యల్ని అడగండి' అన్నాడు.

పిల్లలు మళ్ళీ వెళ్ళారు. ఈసారి విప్రసతుల్ని అడిగారు. శ్రీకృష్ణుని పేరు చెప్పగానే ఆ తల్లులు చలించి పోయారు. గగుర్పాటు చెందారు. ఇదంతా తమ పూజాఫలంగా భావించారు. వెంటనే భోజనాలు తీసికొని కృష్ణుడున్న చోటికి వచ్చారు. పరమాత్మకు నివేదించారు. పరమాత్మ వారిని అనుగ్రహించి ఆశీర్వదించాడు. అందరూ భోంచేశారు. 'ఇక మీరు వెళ్ళండి' అన్నాడు శ్రీకృష్ణుడు. కాని, శ్రీకృష్ణుని విడిచి వెళ్ళమని విప్రసతులు భీష్మించుకున్నారు. పతి, గతి అన్నీ తమకు శ్రీకృష్ణుడే అన్నారు. అయినా పరమాత్మ వారికి నచ్చ చెప్పాడు. భక్తికి దూరభారాలు లేవని చెప్పాడు.

శ్రవణాత్ దర్శనాత్ ధ్యానాత్ మయి భావోను కీర్తనాత్
న తథా సన్ని కర్షేణ ప్రతియాత తతో గృహాన్

'నా వద్ద మీరుండటం కన్నా, నన్ను మీ వద్ద ఉంచుకొని జీవించండి. నా తత్త్వమును వింటూ, నన్నే దర్శిస్తూ, ధ్యానిస్తూ, కీర్తిస్తూ జీవించండి. మీ భర్తల వద్దకు తిరిగి వెళ్ళండి' అని చెప్పగానే, బరువైన అడుగులు వేసుకొంటూ విప్రసతులు వెను దిరిగారు. వారు వెళ్తూ ఉంటే, శ్రీకృష్ణుడు రెప్ప వాల్చకుండా చూస్తున్నాడు. ఎవరిని? వెళ్తున్న వారిని కాదు. తన వద్దకు రాలేక విలపిస్తున్న ఒక విప్రుని భార్యను.

విప్రసతులు శ్రీకృష్ణునికి భోజనాలు తీసుకొని బయలుదేరే సమయంలో ఒక బ్రాహ్మణుడు భార్యను నిరోధిస్తాడు. కృష్ణుని వద్దకు వెళ్ళేందుకు అంగీకరించడు. కాని, భక్తురా లైన విప్రసతి తీవ్రంగా దుఃఖిస్తుంది. ఇంతకాలం ఎవరి దర్శనానికి తన హృదయం పరితపిస్తూ ఉండిందో, ఆ శుభసమయం సమీపించింది. కర్మబంధాలు విడిపోయే పుణ్యకాలం వచ్చింది. ఈ మహదవకాశాన్ని దూరం చేసుకోవటం తనకు సాధ్యం కావటం లేదు. ఎలాగైనా వెళ్ళ వలసిందే నని పట్టు పట్టింది. కాని, భర్త తన మంకుపట్టును వీడలేదు. ఆమెను ఇంట్లో బంధించాడు. తలుపు వేసి తాళం పెట్టాడు. అంతే. ఆ మహాసాధ్వి లోపల విలపిస్తూ ఉంది. ఆమె లోపల వాసుదేవుడు విహరిస్తున్నాడు. విహరించే వాసుదేవునికి ఆ తల్లి మనోవేదనను వినిపిస్తోంది. ఇది వేదన కాదు. నివేదన.

'భగవాన్! నీ పవిత్ర చరణాల వద్ద పడియున్న కుసుమాన్ని నేను. ఆడినా, వాడినా అక్కడే. నా పూజలో ఆశలు లేవు. నా పూజ నీ కొరకే. నా పూజాఫలము నీవే. నా మనసే నారికేళం. అది నీ చరణాల చెంత పగిలిపోనీ. మాయలన్నీ జలాలై కారిపోనీ. నా కళ్ళలో నీళ్ళే మిగిలున్నాయి. అవన్నీ నీ కొరకే నిలిచి ఉన్నాయి. రా! నా నేత్రాల్లో నిలిచి పో! నా కన్నీటితో నిన్ను అభిషేకించనీ. ఆ తరువాత నిన్ను నాలో దాచుకోనీ. మళ్ళీ నీవు నాకు దూరం కాకుండా నా రెప్పలు మూత పడనీ. పూజాఫలము నీదే. పూజే నాది.

పల్లవి : **పూజా ఫలము నీకే ఉండనీ**
పూజే ఫలముగ నాకు మిగలనీ

అనుపల్లవి : **సలిలము నిండిన నా నయనాలలో**
కదలక నీ రూపు నిలిచిపోనీ ॥ పూజా ॥

చరణములు :

అందీ అందని అందము నీవు
అందుకోలేని ఆశను నేను
రెప్పలు కదలక చూచే కనులలో
నిండి పొరలే కన్నీటిని నేను ॥ పూజా ॥

నీ అడుగుల కడ పువ్వును నేను
నీ కృపతో విరిసే నవ్వును నేను
ఎవరిని కోరని యెదను నేను
నీకు దూరమై బ్రతకలేను ॥ పూజా ॥

నేనని నాదని బిగిసిన మనసు
నారికేళమై పగిలిపోనీ
కలతల గుండెను కుదిపిన మాయలు
నీటిధారలై కారిపోనీ ॥ పూజా ॥

ఆమె అలా చూస్తూనే ఉంది. చూపు నిలబడి పోయింది. దేహంలో అలికిడి ఆగింది. విప్రులతో కలిసొచ్చి భర్త తలుపు తీశాడు. తన భార్య దేహం పడి ఉంది. ఆమె ప్రాణం లేచి పోయింది. ప్రాణనాథుడైన పరమాత్మలో విలీనమై పోయింది. విప్రు లందరు విస్మయంతో నిశ్చేష్టు లయ్యారు. భక్తి వైశిష్ట్యాన్ని గుర్తించారు.

'ఆహా! ఈ స్త్రీకి ఉపనయనం లేదు. గురుసేవ లేదు. తపస్సు లేదు. ఆత్మ విచారము లేదు. ఏదీ లేకపోయినా శ్రీకృష్ణుని యందు దృఢమైన భక్తి ఈ స్త్రీకి కలిగినది. ఉపనయన, సంధ్యావందనాది సంస్కారములు ఉన్నా మనకు ఆ భక్తి కలగలేదు కదా!' అని ద్విజు లందరు దిగులు చెందుతూ పశ్చాత్తాపం చెందారట.

సంస్కారా లన్నీ పుణ్యప్రదములే. సద్భక్తి కొరవడితే సంస్కారాలు సత్ఫలితాల నివ్వవు. పరమాత్మ మన చేతల్ని చూచేవాడు కాడు. చిత్తాన్ని చూచేవాడు. భాగ్యాలు చూసేవాడు కాడు. భావాలు గ్రహించే వాడు. **భావగ్రాహి జనార్దనః**

విప్రసతులు వెళ్తూ ఉంటే కృష్ణుడు చూస్తూ ఉండిపోయాడు. నిరోధింపబడి, ప్రాణాలను పరమాత్మకు సమర్పించిన పుణ్యశీల ఆ విప్రసతిని చూస్తూ ఉన్నాడు. కృపచూస్తూ ఉన్నాడు. ఇదే పూజాఫలము.

గోపికా వస్త్రాపహరణం

అనిత్యాలను ఆలింగనం చేసికొని నిత్యానందాన్ని అనుభవించాలనుకోవటం భ్రాంతి. ఇదే జీవభ్రాంతి. భ్రాంతిలో **'అహం'** భావన పుడుతుంది. ఇదే జీవభావన. అహంభావనే రాగద్వేషాలకు కారణ మవుతుంది. రాగద్వేషాలు ప్రగతికి ప్రతిబంధక మవుతాయి. దగ్గరై బాధించేది ద్వేషము. దూరమై బాధించేది రాగము. ఏది ఏమైనా, రెండున్న చోట గండాలు తప్పవు. ఇవే బ్రతుకులో సుడిగుండాలు.

ఎవరు ఎవరికి ఏమీ కాని ఈ ప్రపంచంలో, కల్పించుకొనే వన్నీ బంధాలే కాని బాంధవ్యాలు కావు. పరమాత్మతో సంబంధమే నిత్య సంబంధం. రెండున్నాయనే భ్రాంతిలో, ఉన్న ఒక్క సత్యానికి దూరం కానవసరం లేదు. మనిషి హృదయంలో రెండు ఒకటిగా తెలిస్తే, వ్యక్తి కళ్యాణం జరుగుతుంది. అదే లోక కళ్యాణానికి దారి తీస్తుంది. భేదం లోనే దోషాలు. పరమాత్మ నిర్దోషం. సమం. దోషాల్ని కడిగేసుకొంటే, కల్మషయుతు డైన జీవుడే నిష్కల్మషమైన బ్రహ్మముగా శోభిస్తాడు.

లభన్తే బ్రహ్మ నిర్వాణం ఋషయః క్షీణ కల్మషాః

క్షీణ కల్మషాః=నశించిన కల్మషములు గల, **ఋషయః**=జ్ఞానులు, **బ్రహ్మనిర్వాణం లభంతే**= బ్రహ్మానందమును పొందుతారు అని భగవద్గీతలో భగవానువాచ. అందరికీ బ్రహ్మత్వం కావాలి. కాని, జీవత్వాన్ని వదిలేందుకు ఇష్టపడరు. అహ మున్నంత వరకు జీవత్వం పోదు. జీవత్వాన్ని పోగొట్టుకొనేందుకే సాధన. జ్ఞానసాధన. సాధన లన్నీ సాధ్యరూపు డైన పరమాత్మ కొరకే. పరమాత్మ అనంతుడు. కనుక అద్వయుడు. అభేద జ్ఞానమే పరమాత్మ జ్ఞానము. భేదమే జీవత్వము. జీవత్వాన్ని పోగొట్టుకొని బ్రహ్మత్వంతో మనం భాసించాలి. ఇదంతా పరమాత్మ అనుగ్రహం తోనే సిద్ధిస్తుంది. ఇదే వస్త్రాపహరణ లీల. గోపికా వస్త్రాపహరణ లీల.

గోపికలు బాలకృష్ణుని ప్రాణతుల్యంగా ప్రేమించారు. పరమాత్మకు క్షణకాలం కూడా దూరం కాకూడదని వారి ఆకాంక్ష. అభిలాష. వారి అభీష్టం ఫలప్రదం కావాలని కాత్యాయనీ వ్రతాన్ని ఆచరించారు. అదే గౌరీదేవి నోము. హేమంత ఋతువులో ప్రథమమాస మైన మార్గశీర్షంలో నియమ నిష్ఠలతో కాత్యాయనీ వ్రతాన్ని ప్రారంభించారు. శ్రీకృష్ణుడు తమకు పతిగా లభించాలని సంకల్పం చేశారు.

కాత్యాయని మహామాయే మహాయోగి న్యధీశ్వరి
నందగోపసుతం దేవి పతిం మే కురు తే నమః

'ఓ కాత్యాయనీ! మహాయోగినీ! జగదీశ్వరీ! నాకు నందుని కుమారుడైన శ్రీకృష్ణుని పతిగా అనుగ్రహించు. నీకు నమస్కారము' అని ఒక్కొక్క గోపిక ప్రత్యేకంగా సంకల్పం

చేయటం జరిగింది. ఉషః కాలంలో యమునలో స్నానం చేసి, ఇసుకతో గౌరీదేవి ప్రతిమను చేసి, ఈ శ్లోకంతో సంకల్పం చెబుతూ ఒక మాసం రోజులు వ్రతాన్ని ఆచరించారు గోపికలు. గోపికలకు కోరికలు లేవు. వారిది ఒక్కటే కోరిక. పరమాత్మ తమ సొంతం కావాలి అనేదే వారి కోరిక. అంతేకాని, విషయసుఖాల కొరకు వారు పరమాత్మను ఆశ్రయించ లేదు.

కామము ప్రతి హృదయంలో ఉంటుంది. లౌకికుల హృదయం లోని కామము విషయ భోగాల చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటుంది. భక్తుల హృదయాలలో కదిలే కామం పరమాత్మ వైపు పయనిస్తూ ఉంటుంది.

విషయాన్ ధ్యాయత ఛ్చిత్తం విషయేషు విషజ్జతే
మా మనుస్మరత ఛ్చిత్తం మయ్యేవ ప్రవిలీయతే

విషయాలను ధ్యానించే మనస్సు విషయాలలో మగ్నమై ఉంటుంది. నన్ను స్మరించే చిత్తము నా యందే నిమగ్నమై ఉంటుంది అని భాగవతంలో పరమాత్మ స్వయంగా తెలియ జేశాడు. గోపికల చిత్తము పరమాత్మ కన్నా అన్యమైన విషయాలలో రమించ లేదు. అందుకని శ్రీకృష్ణుని కొరకే వారు కాత్యాయనీ వ్రతాన్ని ఆచరించారు.

వేదన అంతరించేది పరమాత్మ కరుణ తోనే అని వారికి అర్థమై పోయింది. జీవిత గమ్యము జగన్నాథుడే అని నిశ్చయమైంది. ఏది తోడున్నా లేనిదేయని, ఉన్న ఒకానొక తోడు, నీడ భగవంతుడే నని తేలిపోయింది. నాది అనేది ఏదైనా బంధమే నని, అంద మనేది ఆనంద మనేది పరమాత్మకు సంబంధించిందే అని నిశ్చయించు కున్నారు గోపికలు.

పల్లవి: **రాధా రమణ - రాదేల కరుణ!**
దేవకీనందన - మాకేల వేదన! ॥ రాధా ॥

అనుపల్లవి: **జీవుల గమ్యము నీవే కావా!**
బ్రతుకు సంద్రమున నీవే నావ! ॥ రాధా ॥

చరణము: **నా దనుకొంటే అంతా నరకము**
కా దనుకొంటే ఎంతో సుఖము
లే దనుకొంటే ఎక్కడి బంధము?
తోడు నీవుంటే అదియే అందము ॥ రాధా ॥

మాసం రోజులు గడిచాయి. వ్రతం పూర్తి కావచ్చింది. గోపికలు యమునను సమీపించారు. వస్త్రములను తీరమున ఉంచి, స్నానం చేసేందుకు నదిలో దిగారు. శ్రీకృష్ణుడు గోపబాలురతో కలసి వచ్చి, వారి వస్త్రములను అపహరించి, దగ్గరే యున్న కదంబ వృక్షము నెక్కి కూర్చున్నాడు. వృక్షశాఖలపై చీరలు వ్రేలాడు తున్నాయి. శ్రీకృష్ణుడు మురళీనాదం చేశాడు. అది చూచి గోపికలు సిగ్గుతో చలించి పోయారు.

తమ వస్త్రాలను అనుగ్రహించ మని అడిగారు. బాలకృష్ణుడు ఇవ్వలేదు. ఎంత ప్రార్థించినా ససేమిరా ఇవ్వనంటున్నాడు. వారే తీరానికి వచ్చి తీసుకోవాలట.

దేహాభిమానం ఉన్నంత వరకు దైవానుభూతి కలగదు. దేహాభిమానం జీవ భావనకు సంబంధించింది. అది సాధన దశలో కూడా నిషేధమే. సాధకుడు **'నాహం కర్తా హరిః కర్తా'**. నేను కర్తను గాను. హరియే కర్త అనే భావనతో ఉంటాడు. సిద్ధ పురుషుడు **'అహం అకర్తా'**, ఆత్మయైన తాను అకర్తయే ననే జ్ఞానంతో ఉంటాడు. గోపికలు పరమాత్మ కొరకు వ్రతా న్నాచరించారు. కాని, దేహాత్మ భావంతో చరిస్తున్నారు. దానిని దూరం చేసి వారికి పూర్ణ ఫలాన్ని అనుగ్రహించా లనేది పరమాత్మ అభిప్రాయం.

'అహం' మనం తొలగించుకుంటే పోయేది కాదు. పరమాత్మ అనుగ్రహం తోనే పోతుంది. అందుకే సాధన లన్నీ. బాలకృష్ణుడు చీరలు ఇవ్వడని గోపికలకు తేలిపోయింది. మరో మార్గం లేక, చలితో బాధ పడలేక, ఒక చేతితో దేహాన్ని కప్పుకొని, మరొక చేతిని చాచి, వస్త్రాలను ప్రసాదించ మని అడిగారు. అయినా కృష్ణుడు ఇవ్వలేదు. రెండు చేతు లెత్తి నమస్కరిస్తేనే ఇస్తా నన్నాడు.

గోపికల అభిమానం గాలిలో కలసి పోయింది. పరమాత్మను ఆశించి వ్రత మాచరించే వారు 'నేను-నాది' అనే అహంకార మమకారాలను ఉంచుకోకూడ దని అర్థమై పోయింది. 'నాది' అనేది ఏదీ ఈ ప్రపంచంలో లేదని, అంతా పరమాత్మదే నని తెలిసి పోయింది. హృదయం పూర్ణంగా పరమాత్మ వైపుకు మరలింది. భగవత్కృప తక్షణ కర్తవ్యమైంది.

పల్లవి : **జాగేల రాజీవ నయన**
నినుబాసి క్షణమైన
మనగలనా కరుణాభరణా ॥ జాగేల ॥

చరణము : **ఇది నాదంటూ, అది కాదంటూ**
పలికి పలికి మది పగిలింది
ఏదీ ఎవరిది కాదని తెలిసి
ఎద నీ వైపుకు మరలింది ॥ జాగేల ॥

దేహాభిమానాన్ని గోపికలు త్యజించారు. రెండు చేతులెత్తి నమస్కరించారు. అంతే. బాలకృష్ణుడు వారికి వస్త్రాలను విసిరివేశాడు. పరమాత్మ ఇచ్చినవి కనుక అవి వారికి ప్రసాదా లయ్యాయి. ప్రశాంతతను పొందారు గోపికలు. పూర్ణహృదయు లయ్యారు. కృతార్థు లయ్యారు.

పరమాత్మ చెబుతాడు, 'గోపికల్లారా! యమునలో వరుణ దేవుడున్నాడు. మీరు సచేలంతో స్నానం చేయాలి. నగ్నంగా స్నానం చేయటం దోషం అని తెలిపాడు. పరమాత్మ కొరకు ఎప్పుడైతే మనం సాధనలు చేస్తూ ఉంటామో ఒకవేళ సాధనలో లోపాలు జరిగితే వాటిని పరమాత్మే సరిచేస్తాడు. కృష్ణుడదే చేశాడు.

కృష్ణుడు అపహరించింది వస్త్రాలు కావు. వాసనలు. దేహాత్మభావాన్ని హరించాడు. గోపికలు దేహాన్ని పరమాత్మ ముందు దాచుకొనే ప్రయత్నం చేయటమే దేహవాసన ఉందనటానికి తార్కాణము. ఇంతకీ పరమాత్మ వద్ద దాపరికం సాధ్యమా? గోపికలు ఏ జలాలలో మునిగి దేహాన్ని కృష్ణునికి కనిపించకుండా దాచాలనుకుంటున్నారో ఆ యమునా జలాలలో కూడా సర్వాంతర్యామి యైన పరమాత్మే ఉన్నాడు. ఇది అర్థం కావాలి. పైగా శ్రీకృష్ణుని పతిగా అనుగ్రహించ మని గౌరీదేవిని ప్రార్థిస్తూ, వారు వ్రత మాచరించారు. పతి వద్ద దాపరిక మెలా సాధ్యం? ఇది కూడా అర్థం కావాలి.

అయితే, బాలకృష్ణుడు దేవుడై కూడా ఇలా అశ్లీలంగా వ్యవహరించటం సబబా! దొంగ లాగా వలువల్ని అపహరించటం సమంజసమా? అనే శంకలు కొందరిలో కదుల్తూ ఉంటాయి. సరే. బాలకృష్ణుడు భగవంతు డేనా? ఇది ముందు నిర్ణయం కావాలి. కృష్ణుడు భగవంతుడు అన్నప్పుడు ఆయనలో దోషం చూచేందుకే అవకాశం లేదు. తాను కానిది ఏముంది కనుక దోషం?

ఇకపోతే, బాలకృష్ణుడు భగవంతుడు కాడు. సామాన్య బాలుడే నంటారా? అప్పుడూ దోషం లేదు. అశ్లీలమూ లేదు. ఏడు, లేక ఎనిమిది సంవత్సరాల పిల్లవాని విషయంలో అశ్లీల మనే పదం ఎలా పొసగుతుందో విజ్ఞులు ఆలోచించాలి. ఇక చోరుడు అంటారా! పరమాత్మ చోరుడెలా అవుతాడు? తనది కాని దానిని, మరొకరికి సంబంధించిన దానిని అపహరించే వాడు చోరుడు. దేహం మనకు పరమాత్మ ఇచ్చిందే. వస్త్రాలు కూడా ఆయన ప్రసాదాలే.

'నాది' అనే మమభావన కొంప ముంచుతుంది. దీనికి 'నేను' అనే అహంభావనే ఆధారంగా ఉంటుంది. ఈ రెండిటిని తొలగించే దివ్యమైన లీలయే వస్త్రాపహరణ లీల.

మమేతి బధ్యతే జన్తుః నిర్మమేతి విముచ్యతే

'నాది' అనేదే బంధము. 'నాది కాదు' అనేదే మోక్షము. ఈ వస్త్రాపహరణ లీల తరువాతే వస్తుంది రాసలీల. దేహాభిమానము దూర మైతేనే మనకు పరమాత్మతో నిత్య సంబంధం ఏర్పడుతుంది. జీవుల హృదయముల యందలి రాగమును విరాగముగా మార్చి, దానిని రస రాగంగా, ఆనంద రూపంగా మార్చేదే రాసక్రీడ.

రసోవైసః. పరమాత్మ రస స్వరూపుడు. ఆనంద స్వరూపుడు. రసరూప జ్ఞానంతో రస స్వరూపుడైన పరమాత్మ యందు అభేదంగా శోభించుటయే రాసక్రీడ. ఈ విధమైన బ్రహ్మానుభూతికి దేహాభిమానం ప్రతిబంధక మవుతుంది. దేహాభిమానం తొలగితే, **మేఘాపాయే అంశుమానివ,** మబ్బు వీడిన సూర్యునిలా బ్రహ్మజ్ఞానం భాసిస్తుంది. ఈ విధంగా ప్రతిబంధకాలను తొలగించి ప్రగతిని ఆవిష్కరించేందుకు జరిగిన లీల వస్త్రాపహరణ లీల.

భగవత్కృప

తల్లి వద్ద చనుబాలు ఉండేది బిడ్డ కొరకే. చంద్రుని లోని చల్లదనం భూమిని చల్లబరచేందుకే. సూర్యుని లోని వెలుతురు విశ్వాన్ని వెలుగులతో నింపేందుకే. హృదయాలలో చలించే ప్రేమ పరమాత్మను చేరేందుకే. చేరి తరించేందుకే. ప్రేమ అందరిలోనూ ఉంది. ప్రేమించకుండా ఎవ్వరూ ఉండలేరు. ఇష్టమైన వారిని కొద్దో గొప్పో అందరూ ప్రేమిస్తూనే ఉంటారు. ఇంతకీ మనిషికి ఇష్ట వస్తువేదో అర్థం కావాలి. ప్రియ వస్తువు ఏదో తెలిసి రావాలి. అలా తెలియనపుడు మనం దేని నైనా ప్రేమించ వచ్చు. కాని, అలా ప్రేమించింది మన ఇష్ట వస్తువు కాకపోవచ్చు. మనం ఆశించింది కాకపోవచ్చు. కనుక ప్రేమించటం ఎంత ముఖ్యమో, అది మనకు తెలిసి ఉండటం అంత ముఖ్యము. ఇదే జ్ఞానము. ప్రేమకు ప్రధానమైన విషయం. పునాది లాంటి విషయం. **తస్యాః జ్ఞాన మేవ సాధన మిత్యేకే.** 'ప్రేమకు జ్ఞానమే సాధనమై ఉంది' అని నారద భక్తిసూత్ర ప్రబోధము.

ఈ ప్రపంచంలో మనం దేనిని ప్రేమించినా, ఎవరిని ప్రేమించినా మనం తెలిసే ప్రేమిస్తాము. ఎందుకు ప్రేమిస్తున్నామో తెలియక పోవచ్చు. అది వేరే విషయం. కాని భగవంతుణ్ణి ప్రేమించటం లౌకిక ప్రేమ లాంటిది కాదు. భగవంతుడు మనకు కనిపించటం లేదు. కనిపించని వ్యక్తిని ఇష్ట వస్తువుగా ఎన్నుకోవటం సాధ్యపడే పని కాదు. కనుక, పరమాత్మ అంటే ఏమిటో మనకు అర్థం కావాలి. అర్థమైతే చాలు. మనకు ప్రియమైన వ్యక్తి కళ్ళ ముందు లేకున్నా మనం ప్రేమించగలం. అలాగే పరమాత్మను ప్రేమించగలం. ఇదే భక్తి. పరమాత్మను సొంతం చేసుకొనేందుకు ఉపకరించే శక్తి.

ప్రేమను మించిన శక్తి ఈ ప్రపంచంలో మరొక దానికి లేదు. అది అపారశక్తి. అనంతశక్తి. యావద్విశ్వాన్ని పిడికిటిలో బంధిస్తుంది ప్రేమ. కేవలం పాండిత్యంలో ప్రేమ లేకపోవచ్చు. కాని, పవిత్రమైన ప్రేమలో పాండిత్యం తెలియకుండా పండిపోతుంది. కనుకనే, అసమాన ప్రతిభావిశేషాలు కలిగి భగవంతుని పొందలేక ఎందరో చతికిలబడితే, కేవలం పవిత్రమైన ప్రేమతో, నిర్మల హృదయంతో, చదువుసంధ్యలు లేనివారు కూడా భగవంతుని కృపకు పాత్రులై తరించి పోయారు.

సత్సంగము పవిత్ర మైనది. నిర్మల మైనది. సత్సంగములో మనస్సుకు భగవత్సంబంధము లభిస్తుంది. శ్రవణ భాగ్యము ప్రాప్తిస్తుంది. భగవత్కథా శ్రవణము వలన మనస్సులోని దోషాలు నశిస్తాయి. రుచుల నుండి, అభిరుచుల నుండి బుద్ధి విడి పడుతుంది. అంతఃకరణము అద్దం లాగ స్వచ్ఛంగా శోభిస్తుంది. అంతే. అద్దంలో ప్రతిబింబము గోచరించినట్లు, బుద్ధిలో పరమాత్మ ప్రకాశిస్తాడు. బృందావనానికి సమీపంలో ఒక పల్లెటూరు. అక్కడ పండ్లు అమ్ముకొని జీవించే ఒక అమ్మాయి ఉండేది. ఒకనాడు ఆ గ్రామంలో కొందరు భక్తులు ఒకచోట కూర్చొని బాలకృష్ణుని దివ్యలీలలను ముచ్చటించుకోవడం చూచి, దగ్గరగా వెళ్ళి కూర్చుంది. కథాశ్రవణం చేసింది. ఆ క్షణం నుండి మళ్ళీ మళ్ళీ వినాలనే కుతూహలం ఆ అమ్మాయిలో జనించింది. రోజూ అలా వింటూ ఉండింది.

అంతే. శ్రవణ ఫలంగా ఆ అమ్మాయిలో భగవద్భక్తి మొగ్గ తొడిగింది. ప్రతిక్షణ వర్ధమానమవుతూ ఉంది.

బాలకృష్ణునిపై ఆ ఫలవిక్రేతికి గాఢానురక్తి, ప్రగాఢభక్తి ఏర్పడింది. శ్రీకృష్ణుడెవరో ఆ అమ్మాయికి తెలియదు. శ్రవణం చేయటం వలన ఆసక్తి ఏర్పడింది. ఆసక్తి భక్తిని పెంచింది. అంతటితో ఆగలేదు. పరమ విరహాసక్తి తోడైంది. దర్శనాభిలాష తీవ్రతర మైంది. రాత్రి పూట నిద్రరాదు. పగటి పూట ఆకలి ఉండదు. 'ఇప్పుడు కృష్ణుడు భోం చేస్తున్నాడేమో! స్నానం చేస్తున్నాడేమో! ఆడుకుంటూ ఉంటాడేమో! నిద్రపోతున్నాడేమో!' ఇలా నిరంతరం కృష్ణుణ్ణి గూర్చే ఆలోచించ సాగింది. ఎలాగైనా బాలకృష్ణుని దర్శించా లనుకుంది. బుట్టలో పండ్లు ఉంచుకొని, వాటిని అమ్మేందుకు కృష్ణుడుంటున్న వీధిలోకి వచ్చింది. 'పళ్ళో - పళ్ళో' అని కేక వేసింది. కృష్ణుని ఇంటి ముందు చెట్టు క్రింద కూర్చుని అరుస్తూ ఉంది. పళ్ళు కావాలని బాలకృష్ణుడు వస్తాడు. అతణ్ణి కళ్ళారా దర్శించ వచ్చు అనుకుంది. ఎన్నిసార్లు అరచినా కృష్ణుడు రాలేదు.

చాలా సేపు నిరీక్షించింది. అయినా రాలేదు. బహుశ ఇంటి వెనుక వైపు ఉన్నాడేమో! ఇంటి చుట్టూ తిరుగుతూ అరచింది. పరమాత్మ వసించే ఆ ఇల్లు ఇల్లు కాదు. ఆలయం. దేవాలయం. తెలియకనే చుట్టూ తిరిగి ప్రదక్షిణం చేసింది. మళ్ళీ వచ్చి చెట్టు క్రింద కూర్చుంది. పళ్ళో - పళ్ళో అంటూ ఉంది. కృష్ణుడు రాలేదు. ఎందుకని? ఇంట్లో లేడేమో! ఎలా లేకుండా పోతాడు? అంతటా ఉండేవాడు ఇంట్లో ఉండడా? వినిపించలేదేమో? అదెలా సాధ్యం? శబ్దానికి కారణ మైన వాడి నుండి ఏ శబ్దం దూరంగా పోతుంది? మరెందుకని రాలేదు? పరమాత్మను శబ్ద జాలంతో, ప్రదక్షిణాలతో కదిలించ లేము. పరమాత్మను కదిలించేది హృదయమే. హృదయంలో ప్రేమభక్తి పొంగి పొరలనిదే పరమాత్మ మనల్ని సమీపించడు.

బాలకృష్ణుడు రాలేదు. ఆ ఫలవిక్రేతిలో విరహాసక్తి హద్దులు దాటింది. మనస్సు విలవిల లాడుతోంది. గుండె నీరైపోతూ ఉంది. కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి. భగవాన్! నాలో ఏ లోపముంది? ఎందుకని నాకు కనిపించవు? ఏటి నీరు పొలాలను చేరితే పైరు పెరుగుతుంది. నీ కథామృతంతో తడిసిన నా హృదయం పండకుండా, నిండకుండా ఎండిపోతూ ఉంది. ఎందుకని? అని తనలో తాను రోదించ సాగింది.

పల్లవి: ఏరు పారింది - పైరు పెరిగింది చేరువైన నా మది కుమిలింది ॥ ఏరు ॥

అనుపల్లవి: ధన్యజీవుల పుణ్యపంటలు తగని వారికి ఎండమావులు ॥ ఏరు ॥

చరణములు:

మూగ వెదురులో మురిపెముగా రాగము నింపిన అనురాగము
గుండె నిండిన భక్తి పొంగినా మారు పలకని వెన్నుని మౌనము ॥ ఏరు ॥

నలుపు మెరుపులో వలపు ఉందని పిలుపు నిచ్చినవి యమునా జలములు
నలుపులైన మము నలుపుచుంటివి నీ రంగు రహస్యము ఘనమైన తెలుపు ॥ ఏరు ॥

కొండంత వెలుగును విరజిమ్మినది కోమలమైన నీ చరణ కమలము
కళల కాంతులతో విచ్చుకున్నది పులకించిన నా హృదయ కమలము ॥ ఏరు ॥

ప్రేమ లతనై నను ప్రాకనీ - నీ పద లయ గతినై ఆడనీ
నీ యెదలో శ్రుతినై పాడనీ నీ మదిలో స్మృతిగా మిగలనీ **॥ ఏరు ॥**

దుఃఖిస్తూ, 'పళ్ళో - పళ్ళో' అని మళ్ళీ అరచింది. ఆమె కన్నీళ్ళు కన్నయ్యను లేపాయి. ధాన్యాన్ని చేత పట్టుకొని బాలకృష్ణుడు ఆ అమ్మాయి ముందు నిలబడ్డాడు. 'ఈ ధాన్యాన్ని తీసుకొని నాకు పండ్లివ్వు' అన్నాడు కృష్ణుడు. ధాన్యం తీసుకొంది. పండ్లు ఇవ్వటం లేదు. 'ధాన్యం పుచ్చుకున్నావు. పళ్ళు ఇవ్వ వెందుకని? తొందరగా ఇవ్వు' అన్నాడు బాలకృష్ణుడు. 'ఉండు ఇస్తాను.నీ విచ్చిన ధాన్యానికి ఎన్ని పళ్ళు ఇవ్వాలో ఆలోచించుకుంటున్నాను' అంది ఆ ఫలవిక్రేతి. ఈ మాట వాస్తవం కాదు. పండ్లు ఇచ్చేస్తే, కృష్ణయ్య వెళ్ళిపోతాడు. ఏదో విధంగా ఆలస్యం చేస్తే, మరికొంత సేపు ఆ దివ్య ముఖారవిందాన్ని దర్శించ వచ్చు అనేది ఆవిడ అభిలాష. ఇది నిజంగా వ్యాపారమే. **సగుణ బ్రహ్మ విషయ మానస వ్యాపారః.** 'తొందరగా ఇవ్వు. నాకు పనుంది' అని దోసిలి పట్టి అడుగుతున్నాడు పరమాత్మ. మోక్షప్రదాత యైన భగవంతుడు భక్తురాలి ముందు ప్రేమభిక్షను అర్థిస్తున్నాడు. అందుకే **భక్తిరేవ గరీయసీ** అన్నది నారద భక్తిసూత్రము.

పరమాత్మను మనసారా దర్శిస్తూ, ఆయన అమృత హస్తాలలో ప్రేమఫలాలను ఉంచింది ఫలవిక్రేతి. ఆమె బుట్ట లోని పండ్లన్నీ పరమాత్మ కిచ్చేస్తుంది. **ఫలానీమాని సర్వాణి గోపీభ్యః అభ్యదాత్ప్రభుః.** **ఇమాని సర్వాణి ఫలాని**=ఈ పళ్ళన్నీ, **గోపీభ్యః** =గోపికలకు, **ప్రభుః**=పరమాత్మ, **అభ్యదాత్**=ఇచ్చేశాడు. ఫలాలన్నీ పరమాత్మ కిచ్చి తన భక్తికి ఫలంగా ప్రాప్తించిన దివ్య దర్శనముతో పులకించిపోతూ ఉంది ఫలవిక్రేతి. 'ఇక వెళ్ళనా?' అన్నాడు బాలకృష్ణుడు. పండ్లమ్మాయి మారు పలకలేదు. తనలో తాను అనుకుంటోంది. 'భగవాన్! వెళ్ళమని చెప్పేందుకా నేను నిన్ను పిలిచింది? ఇక నీవు నాకు దూరంగా వెళ్ళలేవు. నా మనస్సు నీవు లేకుండా క్షణం కూడా ఉండలేదు' అని భావిస్తూ, వెళ్తున్న బాలకృష్ణుని కన్ను ఆర్పకుండా చూస్తోంది. కృష్ణుడు ఇంట్లోకి వెళ్ళాడు. కానీ, ఆయన తన హృదయం లోకి వెళ్ళినట్లు భావిస్తూ, పారవశ్యంతో మెల్లగా అడుగులు వేసుకొంటూ తన ఇంటికి వెళ్ళింది. తలపై నున్న ఖాళీ పండ్లబుట్టను దించి క్రింద పెట్టింది. అంతే. దిగ్భ్రాంతి చెందింది. ఆ బుట్ట నిండా అమూల్యమైన రత్నాలు నిండి ఉన్నాయి.

ఫల విక్రయిణీ తస్యచ్యుత ధాన్యం కరద్వయమ్
ఫలై రపూర యద్రత్నైః ఫలభాండ మపూరితమ్

'ధాన్యం పోసిన బాలకృష్ణుని రెండు చేతులను పండ్లతో నింపింది ఫలవిక్రేతి. కాని, తన బుట్టను రత్నాలతో నింపాడు పరమాత్మ'. పరమాత్మ కరుణ అలాంటిది. మనకు తెలియకుండా అందేదే పరమాత్మ కృప. కాని, పళ్ళమ్మే ఆ అమ్మాయి రత్నాలను చూచి అనుకుంటోంది. 'భగవాన్! ఈ రత్నాలు నీ ప్రేమకు ప్రతిరూపాలు. వీటిని భద్రంగా దాచుకుంటాను. వినియోగించుకో లేను. ప్రతిరోజు ఆ రత్నాలలో నా శ్యామరత్నాన్ని దర్శించుకొంటాను. కృష్ణా! నాకు కావలసింది ఈ రత్నాలు కావు. నాకు జ్ఞానరత్నం కావాలి. శ్యామరత్నం కావాలి'.

గోపికాగీతం

నీళ్ళు పోస్తూ ఉంటే చెట్లు పెరుగుతాయి. భావిస్తూ ఉంటే, తదనుగుణంగా బ్రతుకుతూ ఉంటే ఆయా భావాలు, గుణాలు కూడా వృద్ధి చెందుతూ ఉంటాయి. విషయసుఖాల యందు ప్రీతి గలవాడు వాటిని ఎంతగా అనుభవించినా ఇంకా ఇంకా అనుభవించాలనే ఉత్సుకతే కలిగి యుంటాడు. లోభి ఎంత కూడబెట్టినా, ఇంకా కూడబెడితే బాగుండుననే భావిస్తూ ఉంటాడు. కొందరు పుణ్యాత్ములలో దానగుణం వ్యసనంలా కనిపిస్తుంది. ఎంత ఇచ్చినా వారికి తృప్తి ఉండదు. ఇవ్వలేక పోయినా, వాగ్దానా లైనా చేస్తూ ఉంటారు. పరోపకారం ఆరవ ప్రాణంగా భావిస్తారు.

అలాగే, భక్తులు భగవంతుని విషయంలో తృప్తి లేకుండా ఉంటారు. ఎంత వినినా ఇంకా వినాలనుకుంటూనే ఉంటారు. ఎంతగా ప్రవచించినా ఇంకా ఏదో ఏదో చెప్పాలనే ఉంటుంది. ఎంతగా కీర్తించినా తృప్తి ఉండదు. **'ప్రతిక్షణ వర్ధమానం'.** క్షణక్షణానికి పెరుగుతూనే ఉంటుంది. ఇది ప్రేమరూప మైన భక్తికి పరాకాష్ఠ.

ప్రేమను అందరూ పంచలేరు. ఉన్నవాళ్ళే పంచగలరు. లేనివాళ్ళు పంచలేరు. ఈ ప్రపంచంలో ప్రేమే భాగ్యము. ప్రేమున్న వారే భాగ్యవంతులు. వారే భాగవతులు. భక్తులు. ఒక్క మాటలో చెప్పాలంటే, భాగవతంలో గోపికలు. ప్రేమ తప్ప రెండవది తెలియని వారు. వారి వద్ద ప్రేమ పుష్కలంగా ఉంది. అంతే కాదు. ప్రేమ యొక్క వినియోగం కూడ వారికి తెలుసు. ఎక్కడ దాచితే ప్రేమ శూన్య మౌతుందో, ఎక్కడ సమర్పిస్తే పూర్ణ మవుతుందో వారికి తెలుసు. కనుకనే వారి హృదయం లోని పవిత్ర ప్రేమను శ్రీకృష్ణునికి సమర్పించి తరించి పోయారు.

గోపికల గుండెగుడిలో ప్రేమే దీపం. ఆరని దీపం. వారి మనస్సులలో కృష్ణుడే కమనీయ రూపం. మారని రూపం. ప్రేమ చెవిటిది. వేరొకటి వినలేదు. ప్రేమ గ్రుడ్డిది. మరొకటి చూడలేదు. నది సముద్రం వైపుకే పయనిస్తుంది. గోపికల ప్రేమ గోపాలుని చెంతకే పరుగు దీస్తుంది. గోపికలు ఎందరో? కాని వారి భావం ఒక్కటే. వారి హృదయం ఒక్కటే. వారి మాట ఒక్కటే. వారి ప్రేమ ఒక్కటే. అందుకనే గోపిక లందరూ కలసి పాడిన పాటలు గీతాలు కాకుండా 'గీతం' అని ఏక వచనంతో పిలువ బడ్డాయి. అదే గోపికాగీతం. భాగవత సాగరంలో లభించిన అమృత కలశం. రాసపంచాధ్యాయిలో దొరికిన అక్షయధనం. ఒకనాడు గోపికల మధ్య గోపాలుడు అదృశ్య మవుతాడు. గోవిందుని చూడకుండా గోపికలు ఉండలేరు. అంతే. వనమంతా గాలించారు. నోరెత్తి పిలిచారు. ప్రేమ పలుకు వినిపించారు.

పల్లవి : **కావగరావా! కరుణింపగలేవా!**
అనుపల్లవి : **భక్తే గాని ముక్తి ఎరుగని శక్తి హీనులం**
అతిదీనులం - బలహీనులం **॥ కావగ ॥**

చరణములు :

వెన్నలాంటి నీ మనసు
మిన్నకున్న దేమి స్వామి
మా నొసటిరాతలు అడ్డుకున్నవా ఏమి?
అందరివాడవా! మాకందని వాడవా? ॥ భక్తే గాని ॥

పువ్వులలో దారమువోలె
ఒదిగిపోయినావా స్వామీ!
పువ్వుల సువాసన వోలె
కానరాక ఉంటివా?
వినిపించే స్వామీ - మాకు కనిపించ వదేమి?
చెవులు చేసిన పుణ్యమేమి? కన్నులలో పాపమేమి? ॥ కావగ ॥

ఎంత పిలిచినా, పాడినా, మొరపెట్టుకున్నా కృష్ణుడు రాలేదు. కృష్ణ విరహాన్ని గోపికలు భరించలేక పోయారు. విలపించారు. ఆ విలాపాన్ని ఆలపించారు. గోపికల గొంతులు అనేకము. కాని, గానం ఒక్కటే. భావం ఒక్కటే. బాధా ఒక్కటే. ఆ బాధలో అంతా ప్రేమే. గోపికలది పిచ్చి ప్రేమ. కనుకనే భాగవతంలో శుకబ్రహ్మ **కృష్ణాన్వేషణ కాతరాః - తదాత్మికాః - గోప్యః ఉన్మత్తవచః** అన్నారు.

కృష్ణుని కొరకు వెదికి వెదికి నిరాశ చెందిన గోపికలు కృష్ణగత చిత్తులై పిచ్చి మాటలు పలికారు అన్నాడు. అవును. అవి పిచ్చిమాటలు. పిచ్చిపాటలు. ప్రేమపిచ్చి పాటలు. అవే 'గోపికాగీతం'గా ప్రాచుర్యాన్ని పొందాయి.

గోపికల ప్రేమ పరిమిత మైనది కాదు. సంకుచిత మైనది కాదు. వారి ప్రేమ అనంత మైనది. పరిపూర్ణ మైనది. శ్రీకృష్ణుని రూపాన్ని వారు ప్రేమించినా, కృష్ణుని స్వరూపమును వారు మరువ లేదు. కుండను చూచునపుడు కూడా సత్యమైన మట్టియే గోచరించునట్లు, శ్రీకృష్ణునితో కలిసి వారు జీవిస్తున్నా, శ్రీకృష్ణుని అనంత స్వరూపమే వారి బుద్ధిలో ఉండింది. కనుక అంతర్యామియై, సర్వసాక్షిగా ఉన్న పరమాత్మను తమ ప్రార్థన నాలకించి దర్శన మివ్వమని ప్రార్థిస్తున్నారు.

శ్లో ॥ నఖలు గోపికా నందనో భవాన్
అఖిల దేహినాం అంతరాత్మ దృక్ ।
విఘున సార్థితో విశ్వ గుప్తయే
సఖ ఉదేయివాన్ సాత్త్వతాం కులే ॥

హే సఖా! కృష్ణా! నీవు యశోదా నందనుడివి కావు. ఇది వాస్తవము. సమస్త దేహాలలో అంతర్యామివి నీవే. బ్రహ్మదేవుడు ప్రార్థించటము చేత విశ్వకళ్యాణానికై యాదవ కులమున జన్మించావు.

నఖలు గోపికా నందనో భవాన్. నీవు గోపికా నందనుడవు కావు అంటున్నారు. అంటే, నందకుమారుడు కాడని కాదు. కాని, నంద కుమారుడివే కావు; సమస్తములో నిండియున్న వాడివి. అన్ని పాత్రలలో ఒకే ఆకాశ మున్నట్లు సర్వప్రాణుల లోని అంతర్యామివి నీవే అంటున్నారు. ఇది గోపికల కున్న సర్వాత్మ భావము. వారి జ్ఞానానికి పరాకాష్ఠ. పరమాత్మ యొక్క అనంత మహిమను తెలిసిన వారు కనుక గోపికలు భగవత్కథా వైభవమును దివ్యంగా గానం చేశారు.

శ్లో ॥ తవ కథామృతం తప్తజీవనం
కవిభి రీడితం కల్మషాపహం ।
శ్రవణ మంగళం శ్రీమదాతతం
భువి గృణంతి యే భూరిదా జనాః ॥

కృష్ణా! నీ కథామృతము సంసారమగ్ను లైన వారికి బ్రతుకు తెరువైంది. జ్ఞానులచే స్తుతింప బడింది. కర్మ కల్మషాన్ని కడిగేస్తుంది. వింటే చాలు. మంగళప్రదం. **శ్రీమత్. . . .శాంత స్వరూపం.** అట్టి నీ కథామృతమును ఈ ప్రపంచంలో ఎవరు విస్తృతంగా కీర్తిస్తున్నారో వారే గొప్ప దాతలు.

అమృతాన్ని పానం చేస్తే మరణ ముండదు. కాని, కథామృతము మోక్షాన్ని ప్రసాదిస్తుంది. దేవతలు అమరు లవుతారే గాని అమృతప్రాయులు కాలేరు. కథామృతము ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించి మోక్షాన్ని అనుగ్రహిస్తుంది. సంసార దుఃఖాన్ని హరిస్తుంది. కల్మషాల్ని కడిగేస్తుంది.

అందుకే కథామృతము మంగళకరంగా, శాంతస్వరూపంగా శోభిస్తూ ఉంది. ఇట్టి కథామృతాన్ని ఈ ప్రపంచంలో ఎవరు వితరణ చేస్తున్నారో వారే గొప్ప దాతలు అని గోపికల అభిప్రాయము. పరమాత్మ కథాశ్రవణము వలె భగవంతుని చరణకమల సేవ కూడా సర్వోత్కృష్ట మని గోపికలు గానం చేశారు.

శ్లో ॥ ప్రణత కామదం పద్మజార్చితం
ధరణి మండనం ధ్యేయ మాపది ।
చరణ పంకజం శంతనుం చ తే
రమణ న స్తనేషు అర్ప యాధిహన్ ॥

ఓ రమణా! వ్యాకులహరణా! నీ పాదపద్మము ఆశ్రితుల కోర్కెలను తీర్చుతుంది. బ్రహ్మదేవునిచే పూజింప బడింది. అవనిమాతకు అలంకారమై శోభిస్తుంది. ఆపదలలో స్మరింప దగింది. శాంతిని, సుఖాన్ని ప్రసాదిస్తుంది. అట్టి నీ పాదపద్మమును మా యెడదపై ఉంచు.

పరమాత్మ చరణాలు మోక్ష సదనాలు. ఆపద హరణాలు. ఆనందధామాలు. పరమాత్మ పాదపద్మాలు హృదయంలో ఉంటే, పరమాత్మ ఉన్నట్లే. ఈ విశ్వ మంతయు

పరమాత్మ యొక్క పాదమే నని పురుష సూక్తము. అట్టి పరమాత్మ చరణ కమలాలు హృదయంలో నిలిస్తే, ఇక ఈ ప్రపంచంలో పొంద వలసినది మరొక టుండదని గోపికల అభిప్రాయము. కనుకనే, పరమాత్మ సందర్శనమునకు గోపికలు వ్యధ చెందుతూ విలపిస్తున్నారు. హృదయ తాపాన్ని హరించే ఔషధాన్ని ప్రసాదించ మని గానం చేస్తున్నారు.

'కృష్ణా! నిన్ను అందరూ దుఃఖహరా! అని పిలుస్తారు. మరి మా దుఃఖాన్ని ఎందుకు హరించవు? మంగళస్వరూపా! అని స్తుతిస్తారు. మరి మా జీవితాల్లో అమంగళాన్ని ఎందుకు దూరం చేయవు? మేము యోగులము కాము. రోగులము. భవ రోగులము. ఈ రోగాన్ని పోగొట్టే ఔషధం నీ వద్దే ఉంది. అదే జ్ఞానము. ఆత్మజ్ఞానము. అట్టి ఔషధమును అనుగ్రహించి మమ్మల్ని ఉద్ధరించు' అని గోపికలు ప్రార్థించ గానే శ్రీకృష్ణుడు వారి ముందు ప్రత్యక్ష మయ్యాడు. వారిని ఓదార్చాడు. ప్రేమను పంచాడు. ప్రేమలో వారిని ముంచాడు. గోపికల వంటి భక్తిని కలిగినవా రందరు అలాగే ఉద్ధరింప బడుతారు.

కృష్ణస్తు భగవాన్ స్వయమ్

కృష్ణస్తు భగవాన్ స్వయమ్. శ్రీకృష్ణుడు పూర్ణ వైభవంతో అవతరించిన భగవంతుడు. పోతపోసిన ప్రేమమూర్తి. సుమారు ఐదువేల సంవత్సరాల క్రితం తన ఆదర్శనీయమైన జీవితం ద్వారా, అద్భుతమైన బోధల ద్వారా మానవాళిని ప్రభావితం చేసిన కళ్యాణమూర్తి. ఆయన మాటను నమ్మి ఎందరో తరించి పోయారు. ఆయన చూపిన బాటలో చరించి మరెందరో మహాత్ము లయ్యారు. ఆయన వైభవాన్ని వర్ణించటంలో కొండంత సాహిత్యం దొర్లి వచ్చింది. వస్తూ ఉంది. ఆయన మహిమను కీర్తించటంలో లెక్కకు అందని కీర్తనలు లభించాయి. లభిస్తున్నాయి. ఆయన జీవితాన్ని చిత్రించటంలో ఎన్నో విచిత్రమైన చిత్రాలు కన్నులకు పండుగ చేశాయి. చేస్తున్నాయి. ఆయన భంగిమలను అభినయించటంలో నృత్యకళ ఎంతగానో ప్రభావిత మైంది. అవుతూ ఉంది.

ఇన్ని కోణాల్లో, ఎన్నో విధాలుగా జాతిని, సంస్కృతిని శ్రీకృష్ణుని వలె ప్రభావితం చేసిన వారిని మరొకరిని చూడలేము. ఆర్తులకు ఆయనే ఆస్తి. లేని వారికి ఆయనే కలిమి. అశక్తులకు ఆయనే బలిమి. ముముక్షువులకు తానే మోక్షం. నమ్మి చెడ్డవారు లేరు. కీర్తించి తరించని వారు లేరు. ఆయనొక ప్రేమసాగరం. మునక వేయాలే గాని, ఆ తరువాత అంతా కాంతే. జీవిత మంతా శాంతే.

ప్రేమ అందరి హృదయాలలో ఉంది. అది తమకే పరిమిత మైతే స్వార్థం. పరుల వైపు స్వార్థం లేకుండా పయనిస్తే పరార్థం. పరమార్థం. ప్రేమించటం ఒక గొప్ప కళ. ఆ విషయంలో కృష్ణుని మించిన కళాకారుడు ఈ ప్రపంచంలో కనిపించడు. ఆయన ప్రేమలో ప్రపంచం అరచేతిలో అమలకంలా ఇమిడి పోయింది. ప్రేమకు శ్రమ తెలియదు. ప్రేమ శ్రమను సుఖంగా స్వీకరిస్తుంది. బాల్యం నుండి ఈ ప్రపంచంలో భౌతికంగా అదృశ్య మయ్యేంత వరకు అనుక్షణము శ్రీకృష్ణుడు శ్రమిస్తూనే ఉన్నాడు. కాని, ఆయన ముఖంలో చిరునవ్వు అదృశ్యమైన క్షణం లేదు. ఇదే ప్రేమకు పరాకాష్ఠ.

చదువుసంధ్యలు లేని గోపబాలుర్ని జ్ఞానులుగా మార్చాడు. విద్య లేని గోప వనితల్ని తృప్తి పరచేందుకు ఆడాడు. పాడాడు. ఆడించాడు. వారి లోని భయాలను దూరం చేశాడు. బాధలను అదృశ్యం చేశాడు. వెన్న లాంటి హృదయంతో అందరి గుండెల్ని చల్లబరచాడు. ఇదంతా ప్రేమ. ఆయన వన్నీ ప్రేమ కార్యాలే.

ఆయన ప్రేమ వెనుక ఊహలు లేవు. పథకాలు ఉండవు. ప్రేమించేందుకు ప్రయత్నాలు అవసరం లేదు. ఆయన ప్రేమ సహజమైంది. స్వభావంగా స్వరూపంగా విరాజిల్లుతోంది. ప్రకాశించేందుకు సూర్యుడు ప్రయత్నించాలా? ప్రవహించేందుకు నది పరితపించాలా? ఆశ్రయ మిచ్చేందుకు ఆకాశం శ్రమించాలా? వీచేందుకు గాలి ఊహించాలా? ప్రేమ విషయంలో కృష్ణుడూ అంతే.

తారతమ్యం లేకుండా నది అందర్నీ చల్లబరుస్తుంది. భేదాలు చూడకుండా గాలి అందరికి హాయిని పంచుతుంది. ఈ ప్రేమల్ని, త్యాగాల్ని ప్రకృతిలో ఆవిష్కరించింది తానే. పరమాత్మను అనుకరిస్తూ ప్రకృతి ప్రేమిస్తూ ఉంది. జాతి విలువ తెలిసి గోవుల్ని ప్రేమించాడా? రూప వైభవాన్ని చూచి కుబ్జను కనికరించాడా? కులాన్ని చూచి గోపికల్ని అనుగ్రహించాడా? ధనాన్ని చూచి కుచేలుని కాపాడాడా? ఈ భేదాలు పరమాత్మకు తెలియవు. అందుకే ఆయన సముడు. భక్తులూ అంతే. ఏ గూటి పక్షికి ఆ గూటి పలుకే. కృష్ణ భక్తులకు కృష్ణుని హృదయమే.

నాస్తి తేషు జాతి విద్యా రూప కుల ధన క్రియాది భేదః

భక్తులలో కూడా జాతి భేదము, విద్యాభేదము, రూపభేదము, కులభేదము, ధన ఉద్యోగాది భేదములు ఉండవు. కనుక కృష్ణభక్తి ప్రేమమయమైన ఆదర్శ సమాజాన్ని ప్రపంచంలో ఆవిష్కరిస్తుంది. ఆదర్శాన్ని వాంఛించే వారు, అభ్యుదయాన్ని కాంక్షించే వారు సదా శ్రీకృష్ణుని, ఆయన జీవితాన్ని హృదయంలో భావిస్తూ ఉండాలి.

ఆ రూపం ఎవరిదో కాదు. కృష్ణునిది. ఆ రూపం నీకు శ్రీకృష్ణుని స్మృతికి తెస్తుంది. **కృష్ణః** - ఈ నామం ఎవరిదో కాదు. కృష్ణునిది. ఆ నామం శ్రీకృష్ణుని నీ హృదయంలో పదిలం చేస్తుంది. నీవు చూస్తే కృష్ణుడు కనిపించక పోడు. ఆయన నీ చూపు కన్నా దగ్గరున్నాడు. నీవు పిలిస్తే కృష్ణుడు పలకక పోడు. ఆయన నీ ప్రాణం కన్నా దగ్గరైన వాడు. ఇదే నామ వైభవం. భగవన్నామ వైభవం. నామ రుచి తెలిసిన వారు అన్యమైన రుచులను వాంఛింపరు. నామం ప్రపంచాన్ని మరిపిస్తుంది. మహిమలో మైమరచేలా చేస్తుంది. సదానంద స్వరూపమైన 'కృష్ణ' నామ అఖండజ్యోతిని మన హృదయాలలో వెలిగించుకుందాం.

వెలుగున్న చోట తిమిర ముండదు. కృష్ణనామము కదిలే చోట తృష్ణ ఉండదు. బాధ లుండవు. కష్టాలుండవు. కన్నీళ్ళుండవు. కృష్ణుడు, కృష్ణ నామము రెండు కావు. ఒక్కటే. **వాచ్య వాచకయోః అభేదః**. నామానికి నామికి తేడా లేదు. నామి వైభవమే నామంలో ఉంది. శ్రీకృష్ణునిలో ఏ వైభవముందో కృష్ణ నామములో అదే వైభవముంది.

ఓం నమో భగవతే వాసుదేవాయ - ఇది శ్రీకృష్ణుని మంత్రం. ధృవునికి ముక్తిని అనుగ్రహించిన మంత్రం. ఇది ద్వాదశాక్షర మహామంత్రం. మనం కూడా శ్రీకృష్ణుని వైభవాన్ని 12 వ్యాసాలలో చూశాం. భగవద్గీతలో కూడా భక్తియోగం 12 వ అధ్యాయము. పరమాత్మ స్వరూపమైన భాగవతము కూడా 12 స్కంధాలతో శోభిస్తోంది.

కృష్ణునికి కూడా కష్టాలున్నాయి. కాని కన్నీళ్ళు లేవు. బాధ లున్నాయి. కాని అశాంతి లేదు. క్షణక్షణమూ గండాలే. కాని, బ్రతుకులో అందాలు దూరం కాలేదు. కృష్ణ నామాన్ని భక్తి శ్రద్ధలతో కీర్తిస్తే, మన బ్రతుకులు కూడా ఆనందమయంగా బ్రహ్మానంద మయంగా మారుతాయి. కృష్ణుడు భోగజీవి అని కొందరు, చోరుడని మరి కొందరు, జారుడని ఇంక కొందరు. నీడల్ని చూచే వారే గాని నిజాల్ని గ్రహించగలిగేవా రెందరు?

శ్రీకృష్ణుడు కారాగృహంలో జన్మించాడు. ఆరంభం లోనే కష్టా లెదురయ్యాయి. పుట్టిన తరువాత పట్టున పది నిమిషాలు తల్లి ఒడిలో పడుకో లేదు. పుట్టగానే తల్లిదండ్రుల ప్రేమకు దూరమై గోకులంలో పెరిగాడు. ఆనందంగా ఆడుకోవలసిన వయస్సులో రాక్షసుల నెదుర్కోవలసి వచ్చింది. అడుగడుగునా గండాలే. తాను బాధల్లో కూరుకు పోయినా ఇతరుల బాధల్ని తొలగిస్తూ జీవించాడు. పన్నెండు సంవత్సరా లొచ్చే సరికి గోకులాన్ని వీడి మధురకు వచ్చాడు. దుష్టుడైన మేనమామ కంసుని వధించాడు. హక్కుగా ప్రాప్తించిన రాజ్యాన్ని తాను అనుభవించ లేదు. ఉగ్రసేనునికి అప్పచెప్పాడు. ఆశలు లేనివాడు. ఆదర్శాన్నే ఊపిరిగా పొందినవాడు.

జీవితాంతము ఇలాగే పరోపకారంతో జీవించాడు. భక్తుల నుద్ధరించేందుకే కంకణం కట్టుకున్నాడు. సమాజ అభ్యుదయాన్నే ప్రాణంగా భావించాడు. కురుపాండవుల మధ్య యుద్ధాన్ని నివారించాలని రాయబారం నడిపాడు. రాయబారి అని కూడా చూడకుండా దుష్టులు బంధించాలని ప్రయత్నిస్తే చాకచక్యంతో తప్పించుకున్నాడు. యుద్ధం అనివార్య మైంది. చతుర్దశ భువనాలను కుక్షిలో నింపుకున్న పరమాత్మ అయినా, అర్జునుని రథచోదకుడుగా వెళ్ళేందుకు నిరాకరించని నిష్కామ కర్మయోగి. కర్తవ్య విముఖుడై అర్జునుడు యుద్ధరంగంలో చతికిల బడితే, కర్తవ్యాన్ని, ధర్మాన్ని బోధించి నిలబెట్టిన అసమాన ప్రజ్ఞానిధి.

రాజ్యం పాండవులకు దక్కింది. తాను మాత్రం ఒంటరిగా ద్వారక కెళ్ళాడు. అక్కడేం జరిగింది? తన కళ్ళ ముందే తన వారందరూ ముసలం బట్టి పరస్పరం బాధించుకొంటూ మరణిస్తూ ఉంటే కళ్ళారా చూడవలసిన దుస్థితి అతని కొక్కడికే పట్టింది. అందరూ పోయారు. తానొక్కడే మిగిలాడు.

ఏమిటిదంతా? ఎవరి కుంటుంది ఇలాంటి జీవితం? ఒక నిర్జన ప్రదేశంలో పడుకొని ఆలోచిస్తున్నాడు. కదులుతున్న ఆ మహాత్ముని బొటనవ్రేలును దూరం నుండి చూసి అది మృగచలన మని భావించి బోయవాడు బాణం వేస్తే, అది తగిలింది. ప్రాణం తీసింది.

కారాగృహంలో పుట్టాడు. ఎవరూ లేనిచోట దిక్కులేని విధంగా దేహాన్ని చాలించాడు. జీవితంలో సుఖపడిం దెప్పుడో అర్థం కాదు. బాధలు లేని దెప్పుడో? అయినా తానెప్పుడూ బాధ పడలేదు. బోధ చేస్తూనే జీవించాడు. బ్రతుకులో ఏం జరిగినా ఫరవాలేదు. బుద్ధిలో ఏమి జరగకుండా చూసుకోవాలి. ఇదే శ్రీకృష్ణుని జీవితము అందించే ఆదర్శము. కనుక అన్ని కాలాలకు, అన్ని దేశాలకు, అందరికి శ్రీకృష్ణ పరమాత్మ ఆదర్శమూర్తి. అభ్యుదయ స్ఫూర్తి.